ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888
Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Districts
సంపుటి - 02 సంచిక -24 పేజీలు - 08 వెల - 06/-
మంగళవారం 6 మే 2025

## వర్షాలతో పంట నష్టపోయిన
# రైతులకు పరిహారం..!
### అకాల వర్షాలపై సమీక్షలో సీఎం చంద్రబాబు

- పిడుగుపాటు బాధిత కుటుంబాలకూ
- వెంటనే నష్టాన్ని అంచనా వేయండి
- పలు జిల్లాలకు ఇంకా వర్షసూచన
- ప్రాణ నష్టం వాటిల్లకుండా చర్యలు
- అధికారులు మానవత్వంతో వ్యవహరించాలి
- సాంకేతికతతో ముందస్తు సూచనలు
- ధాన్యాన్ని కొనుగోలు చేయాల్సిందే



**అమరావతి, మే 05, రిపబ్లిక్ న్యూస్ :-**
అకాల వర్షాలు, ఈదురు గాలులు, వడగళ్లతో పంట నష్టపోయిన రైతులకు మంగళవారం సాయంత్రంలోగా పరిహారం అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. పంట నష్టాన్ని వెంటనే అంచనా వేసి, నష్టపోయిన ప్రతి రైతుకూ పరిహారం అందేలా చూడాలని స్పష్టం చేశారు. పిడుగుపాటు కారణంగా చనిపోయిన 10 మంది బాధితుల కుటుంబాలకు కూడా తక్షణమే పరిహారం అందించాలన్నారు. రాష్ట్రంలో గత రెండురోజులు కురిసిన అకాలవర్షాలపై సోమవారం అమరావతి సచివాలయంలో వ్యవసాయ, ఉద్యాన, విపత్తుల నిర్వహణ అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. వర్ష ప్రభావిత జిల్లాల్లో పంట, ప్రాణ నష్టం గురించి అధికారులను అడిగి సీఎం వివరాలు తెలుసుకున్నారు. జిల్లాల్లో పరిస్థితులను కలెక్టర్లు వివరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. రాష్ట్రంలోని పలు జిల్లాలకు ఇంకా వర్షసూచన ఉన్నందున కలెక్టర్లు, అధికారులు ప్రజల్ని అప్రమత్తం చేయాలని, ప్రాణ నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పిడుగులు పడే సమయాల్లో ప్రజల సెల్ ఫోన్లకు హెచ్చరిక సందేశాలు పంపాలన్నారు. సందేశం వెళ్లని పరిస్థితుల్లో దగ్గరగా ఉన్న అధికారులు వెళ్లి ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. విపత్తుల సమయాల్లో అధికారులు మానవత్వంతో వ్యవహరించాలన్నారు. పిడుగులు పడి చనిపోయిన పశు వులకు కూడా నిబంధనల మేరకు పరిహారం వెంటనే విడుదల చేయాలని ఆదేశించారు. ప్రాథమిక అంచనా ప్రకారం వర్షాలతో రాష్ట్రంలో 2,224హెక్టార్లలో వరి, మొక్కజొన్న దెబ్బతిన్నట్లు అధికారులు సీఎంకు వివరించారు.

మిగతా 2లో

# మాక్ డ్రిల్స్ నిర్వహించండి

- రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం సూచన
- పహల్గామ్ దాడి నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తం
- భద్రతా సంసిద్ధతను సమీక్షించాలని రాష్ట్రాలకు సూచన
- పౌరులకు అత్యవసర స్పందనపై అవగాహన కల్పించాలని స్పష్టీకరణ



పహల్గామ్‌లో ఇటీవల చోటు చేసుకున్న ఉగ్రవాద దాడి నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. దేశవ్యాప్తంగా భద్రతా సంసిద్ధతను సమీక్షించి, పటిష్టం చేసే దిశగా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా, అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు అప్రమత్తంగా ఉండాలని, భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టం చేయాలని సూచించింది. భద్రతా పరమైన సంసిద్ధతను పరీక్షించేందుకు వీలుగా ఈ బుధవారం ప్రత్యేకంగా మాక్ డ్రిల్స్ నిర్వహించాలని కేంద్రం అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు కీలక సూచనలు జారీ చేసింది. అంతేకాకుండా, ఈ మాక్ డ్రిల్స్ సందర్భంగా భద్రతా సన్నద్ధతపై సాధారణ పౌరులకు కూడా అవగాహన కల్పించాలని కేంద్రం స్పష్టం చేసింది. ఏదైనా ఊహించని, అత్యవసర పరిస్థితి తలెత్తితే ఏ విధంగా స్పందించాలి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే దానిపై ప్రజలకు తెలియజేయాలని సూచించింది.

## సింహాచలం ఘటనలో ఏడుగురు
# అధికారులపై వేటు

- సింహాచలం ఆలయంలో గోడ కూలి ఏడుగురు మృతి
- ఈ ఘటనపై ప్రభుత్వ చర్యలు
- త్రిసభ్య కమిటీ నివేదిక ఆధారంగా బాధ్యుల గుర్తింపు
- దేవాదాయ, పర్యాటక శాఖలకు చెందిన 7 అధికారుల సస్పెన్షన్
- కాంట్రాక్టర్ ను బ్లాక్ లిస్ట్ లో పెట్టాలని ఆదేశం




2లో

## ఎలక్ట్రానిక్స్, ఎనర్జీ రంగాల్లో
# యువతకు ఉపాధి
### ష్నైడర్ ఎలక్ట్రిక్ సంస్థ ఏపీ ప్రభుత్వం ఒప్పందం -ఐటిశాఖ మంత్రి లోకేశ్ వెల్లడి

**అమరావతి,మే 05, రిపబ్లిక్ న్యూస్ :-**
ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఎనర్జీ, నిర్మాణ రంగాల్లో ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకొని యువతకు ఉపాధి అవకాశాలు పెంచడమే లక్ష్యంఅని ఐటిశాఖ మంతరి లోకేశ్ అన్నారు. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా ప్రపంచస్థాయి ప్రమాణాలతో 9వేల మంది యువతకు ష్నైడర్ ఎలక్ట్రిక్ ఇండియా ఫౌండేషన్ శిక్షణ ఇస్తుంది. శిక్షణా పరికరాలు, వినియోగ వస్తువులు, డిజిటల్ సామగ్రి కోసం ష్నైడర్ ఎలక్ట్రిక్ ఇండియా ఫౌండేషన్ సుమారు రూ.5 కోట్లు- ఖర్చుచేయనుంది. మంగళగిరిలో రూ.15 కోట్లతో ఎలక్ట్రిక్ సెంటర్ ఏర్పాటు-కు ష్నైడర్ అంగీకారం తెలిపింది. ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఎనర్జీ, నిర్మాణ రంగాల్లో ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకొని యువతకు ఉపాధి అవకాశాలు పెంచడమే




లక్ష్యంగా విద్య, ఐటీ-, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ చొరవతో ష్నైడర్ ఎలక్ట్రిక్ సంస్థ ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, ష్నైడర్ ఎలక్ట్రిక్ ఇండియా ఫౌండేషన్ ప్రతినిధులు ఎంవోయూపై సంతకాలు చేశారు. ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఎనర్జీ, నిర్మాణ రంగాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయి అవకాశాలను అందు పుచ్చుకునేందుకుమిగతాది 2లో...

## ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రైతులు నష్టపోయారు
: జగన్

- వర్షాలపై సమాచారం ఉన్నా ప్రభుత్వం పట్టించుకోలేదన్న మాజీ సీఎం
- అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను పరామర్శించాలని పార్టీ నేతలకు సూచన
- రైతులకు పరిహారం చెల్లించాలంటూ ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని నిర్ణయం



2లో



## తెలంగాణ రూపురేఖలు
# మార్చేస్తాం..
### రూ. 2 లక్షల కోట్ల హైవే ప్రాజెక్టులు: కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ
### తెలంగాణలో రూ.2 లక్షల కోట్ల హైవే పనులు: గడ్కరీ

**మే 05, రిపబ్లిక్ న్యూస్ :-**
రాబోయే మూడు, నాలుగేళ్లలో తెలంగాణ రాష్ట్రంలో సుమారు రూ. 2 లక్షల కోట్ల విలువైన జాతీయ రహదారుల ప్రాజెక్టులను చేపట్టనున్నట్లు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ సోమవారం ప్రకటించారు. ఈ భారీ ప్రాజెక్టులతో తెలంగాణ రూపురేఖలు సంపూర్ణంగా మారిపోతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ కాగజ్‌నగర్‌లో రూ. 3,900 కోట్ల విలువైన జాతీయ రహదారి ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేసిన అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు.

మిగతా 2లో

## భారత్, శ్రీలంక ప్రభుత్వాలు సామరస్యంగా
# పరిష్కరించుకోవాలి

- తమిళనాడు మత్స్యకారుల ఘటనలపై పవన్ ఆందోళన
- సమస్య పరిష్కారానికి భారత్, శ్రీలంక ప్రభుత్వాలు చర్చలు జరపాలని సూచన
- మోదీ, చంద్రబాబుతో కలిసి అమరావతిని అభివృద్ధి చేస్తామని వెల్లడి

**మే 05, రిపబ్లిక్ న్యూస్ :-**
బంగాళాఖాతంలో ఇటీవల తమిళనాడుకు చెందిన 24 మంది మత్స్యకారులు శ్రీలంక అధికారుల వల్ల ఇబ్బందులకు గురైన ఘటనలపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. నాగపట్నం జిల్లా మత్స్యకారులు గాయపడటం బాధాకరమని పేర్కొన్నారు. భారత్, శ్రీలంక మధ్య స్నేహపూర్వక సంబంధాలు ఉన్నాయని, తరచూ పునరావృతమవుతున్న ఈ తరహా ఘటనలను స్నేహపూర్వకంగా పరిష్కరించుకోవాలని ఆయన ఆకాంక్షించారు. మిగతాది 2లో...



# సింహాచలం ఘటనలో ఏడుగురు అధికారులపై వేటు

ప్రముఖ పుణ్యక్షేత్రమైన సింహాచలం వరాహ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ఇటీవల గోడ కూలిన ఘటనపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కఠిన చర్యలకు ఉపక్రమించింది. ఈ దుర్ఘటనపై విచారణ జరిపిన త్రిసభ్య కమిటీ సమర్పించిన నివేదిక ఆధారంగా, నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తేలిన ఏడుగురు అధికారులను సస్పెండ్ చేసింది. అదే సమయంలో, నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ ను బ్లాక్‌లిస్టులో పెట్టడంతో పాటు, అతనిపై, మరో ఇద్దరు అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది.సింహాచలం ఆలయ ప్రాంగణంలో గోడ కూలిపోవడంతో ఏడుగురు భక్తులు మరణించడం తెలిసిందే. దీనిపై ప్రభుత్వం తక్షణమే స్పందించి, ఘటనకు గల కారణాలను, బాధ్యులను గుర్తించేందుకు ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీని నియమించింది. ఈ కమిటీ క్షుణ్ణంగా విచారణ జరిపి, ప్రభుత్వానికి తమ నివేదికను అందజేసింది. అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని కమిటీ తన నివేదికలో స్పష్టం చేసినట్లు సమాచారం.కమిటీ నివేదికను పరిశీలించిన ప్రభుత్వం, బాధ్యులపై తక్షణ చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో దేవాదాయ శాఖ మరియు ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ)కు చెందిన ఏడుగురు అధికారులను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సస్పెన్షన్‌కు గురైన వారిలో ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) కె. సుబ్బారావు, ఆలయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) శ్రీనివాసరావు, ఏపీటీడీసీ ఈఈ రమణ, డిప్యూటీ ఈఈలు కె.ఎస్.ఎన్. మూర్తి, స్వామి, ఏపీటీడీసీ అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) పి.మదన్, ఆలయం జూనియర్ ఇంజనీర్ (జేఈ) కె.బాబ్జీ ఉన్నారు.వీరితో పాటు, నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ ను కూడా పూర్తిగా బాధ్యుడిని చేస్తూ, అతడిని బ్లాక్‌లిస్టులో చేర్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. అంతేకాకుండా, సదరు కాంట్రాక్టర్ తో పాటు, నిర్లక్ష్యానికి బాధ్యులైన ఇద్దరు అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కూడా ఉన్నతాధికారులను ఆదేశించినట్లు తెలిసింది. ఈ చర్యల ద్వారా భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు స్పష్టమవుతోంది.ం

## ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రైతులు నష్టపోయారు: జగన్

అమరావతి,**మే 05, రిపబ్లిక్ న్యూస్ :-**
ఆంధ్రప్రదేశ్ లో కురుస్తున్న అకాల వర్షాలకు అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు. రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండడంతో చేతికి వచ్చిన పంట నీటిపాలైందని తీవ్ర ఆవేదన చెందుతున్నారు. పండ్ల తోటలకూ తీవ్ర నష్టం వాటిల్లింది. దీనిపై మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ స్పందించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రైతులు నష్టపోయారని మండిపడ్డారు. వర్షాలపై ముందస్తు సమాచారం ఉన్నప్పటికీ ప్రభుత్వం సరైన చర్యలు చేపట్టలేదని, రైతులను గాలికి వదిలేసిందని విమర్శించారు.ధాన్యం సేకరించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఖరీఫ్‌లో వాతావరణం అనుకూలించక అంతంత మాత్రంగానే దిగుబడి రాగా.. గిట్టుబాటు ధర లభించక రైతులు నష్టపోయారని, ఇప్పుడు చేతికి వచ్చిన పంట నీటిపాలవడంతో నష్టాల్లో కూరుకుపోయారని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై వైసీపీ నేతలతో జగన్ తాడేపల్లి నుంచి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పంట నష్టపోయిన రైతులను పరామర్శించాలని పార్టీ నేతలకు సూచించారు. పరిహారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని జగన్ నిర్ణయించారు.

## ఎలక్ట్రానిక్స్, ఎనర్జీ రంగాల్లో యువతకు ఉపాది

(మొదటి పేజీ తరువాయి)
ప్రతిభావంతులైన బృందాలను తయారు చేయడమే ఈ ఒప్పందం లక్ష్యం. దీని ప్రకారం ప్రభుత్వ ఐటీఐలు, పాలి-టె-క్నిక్ కళాశాలలు, ఎన్ఏసీ శిక్షణా కేంద్రాల్లో 20 అధునాతన -ట్రైనింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయనున్నారు. అంతేకాకుండా అనంతపురంలో రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు-కు ముందుకొచ్చింది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ష్నైడర్ ఎలక్ట్రిక్ మోడ్రన్ పవర్ ఆప్టిమైజేషన్ పైలట్ ప్రాజెక్టు చేపట్టనుంది. మరోవైపు అడ్వాన్స్‌డ్ కోర్సుల్లో శిక్షణ కోసం ఒరాకిల్‌తో ప్రభుత్వం కీలక ఒప్పందం కుదుర్చుకుంది. ఒరాకిల్ మై లెర్న్ ఎ÷-లాట్‌ఫామ్ ద్వారా మూడేళ్లలో 4లక్షల మందికి శిక్షణ ఇవ్వనున్నారు. ఈమేరకు మంత్రి లోకేశ్ సమక్షంలో ఒరాకిల్, ఏపీఎస్ఎస్‌డీసీ మధ్య ఎంవోయూ కుదిరింది.

## కర్ణుడి చావుకు వంద కారణాలు

### మా ఓటమికీ అలాంటి కారణాలే

### మాజీమంత్రి బొత్స సంచలన వ్యాఖ్యలు

అమరావతి,**మే 05, రిపబ్లిక్ న్యూస్ :-**
2024 అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ ఓటమిపై ఆ పార్టీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ కీలక వ్యాఖ్యలు చేశారు. కర్ణుడు చావుకి వందకారణాలు అన్నట్టు-.. వైసీపీ పార్టీ ఓటమికి చాలా కారణాలు ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో చేసింది ఏమీ లేదని, లక్ష 50 వేల కోట్ల రూపాయలు అప్పు తప్ప అని విమర్శించారు. ప్రధాని మోడీ అమరావతికి ఎందుకు వచ్చారు, అమరావతిలో ఇప్పటివరకు ఏమి చేశారు, ఏమి



చేస్తారో ముఖ్యమంత్రి చెంద్రబాబు సమాధానం చెప్పాలని బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. నేడు అనకాపల్లిలో జిల్లా వైసీపీ విస్తృత స్థాయి సమావేశంలో బొత్స సత్యనారాయణ పాల్గొన్నారు. కర్ణుడు చావుకి వంద కారణాలు అన్నట్టు-, వైసీపీ పార్టీ ఓటమికి చాలా కారణాలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో చేసింది ఏమీ లేదు, లక్ష 50 వేల కోట్ల రూపాయలు అప్పు తప్ప. ప్రధాని మోడీ అమరావతికి ఎందుకు వచ్చారు, అమరావతిలో ఇప్పటివరకు ఏమి చేశారు, ఏమి చేస్తారో ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలి. ప్రధాని శంకుస్థాపన చేసిన వైజాగ్ రైల్వే జోన్ ఏది, రైల్వే జోన్ పనులు ఏమైనా అసలు ప్రారంభించారా?. వైజాగ్‌లో ఏకరా భూమి 99 పైసలకు ధారపోశారు. సింహాచలంలో ఏడుగురు మరణానికి ఎవరు కారణం, అవి ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలే' అని బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. సంక్షేమం, అభివృద్ధిని వైఎస్ జగన్ రెండు కళ్లుగా చూశారు. సీఎం చంద్రబాబు తప్పుడు హామీలతో ప్రజలను మోసం చేశారు. కూటమి 11 నెలల పాలనలో ప్రజలకు ఒరిగింది ఏమి లేదు. రాష్ట్రానికి ఏం మేలు జరిగిందో ప్రజలు గమనించాలి. మూడు టీ-వీ ఛానళ్లు, మూడు పేపర్లతో చంద్రబాబు పబ్బం గడుపుకుంటున్నారు' అని బొత్స సత్యనారాయణ విమర్శించారు. అనకాపల్లిలో జిల్లా వైసీపీ విస్తృత స్థాయి సమావేశంలో గుడివాడ్ అమర్ నాథ్, బూడి ముత్యాల నాయుడు, కన్నబాబు, వరుదు కల్యాణి, శోభ హైమావతి తదితరులు హాజరయ్యారు.

-----

## మహిళా ఉద్యోగులకు శుభవార్త

### ప్రసూతి సెలవులు 180కి పెంపు




అమరావతి,**మే 05, రిపబ్లిక్ న్యూస్ :-** ): మహిళా ప్రభుత్వ ఉద్యోగులకు ఏపీ ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. వివాహిత మహిళలకు ఇచ్చే మెటర్నిటీ లివ్ లను చంద్రబాబు సర్కార్ పొడగించింది. మెటర్నిటీ- లివ్‌లను 120 నుంచి 180కి పెంచింది. అంతేకాదు ఇద్దరు పిల్లకు మాత్రమే లివ్‌లు వర్తింపు అనే నిబంధనను కూడా ప్రభుత్వం తొలగించింది. మెటర్నిటీ- లివ్‌లను 180 రోజులకు పెంచుతూ ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుకోగా.. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో మహిళా ప్రభుత్వ ఉద్యోగ వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మహిళా ఉద్యోగుల సమస్యలపై ఫోకస్ పెడతామని ఎన్నికల సమయంలో నేతలు హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు ఇప్పటికే పలు నిర్ణయాలు తీసుకోగా.. తాజాగా మెటర్నిటీ- లివ్‌లను పొడగించింది. ఆంధప్రదేశ్ రాష్ట్రంలో మహిళా ఉద్యోగులకు మెటర్నిటీ- లివ్‌లు 120 రోజులు ఇస్తున్నారు. ఇక నుంచి కేంద్ర ప్రభుత్వం మహిళా ఉద్యోగులకు ఇస్తున్న తరహాలోనే 180 రోజులు ఇవ్వనున్నారు. అంతేకాదు ఇక నుంచి ఎంతమంది పిల్లల్ని కన్నా.. మెటర్నిటీ- లివ్‌లు మాత్రం యథావిధిగా వర్తింస్తాయి. మహిళా ఉద్యోగుల వృత్తి, వ్యక్తిగత జీవితాన్ని బ్యాలెన్స్ చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం పేర్కొంది.

# భారత్, శ్రీలంక ప్రభుత్వాలు సామరస్యంగా పరిష్కరించుకోవాలి

**(మొదటి పేజీ తరువాయి)**
ఈ విషయంలో తక్షణం జోక్యం చేసుకోవాలని విదేశాంగ మంత్రిత్వ శాఖను కోరారు. ఇరు దేశాల ప్రభుత్వాలు నిర్మాణాత్మక చర్చలు జరిపి, మత్స్యకారుల భద్రతకు, గౌరవానికి భంగం కలగకుండా చూడాలని పవన్ కళ్యాణ్ విజ్ఞప్తి చేశారు. పవన్ చేసిన ఈ వ్యాఖ్యలపై ప్రకాశ్ రాజ్ విమర్శించడం, ప్రకాశ్ రాజ్ వ్యాఖ్యలకు ఏపీ బీజేపీ నేత విష్ణువర్ధన్ రెడ్డి కౌంటర్ ఇవ్వడం తెలిసిందే.

**ఏపీకి అమరావతే ఏకైక, శాశ్వత రాజధాని**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అమరావతే ఏకైక, శాశ్వత రాజధానిగా నిలుస్తుందని పవన్ స్పష్టం చేశారు. ఇది కేవలం కాంక్రీట్ నిర్మాణాల సముదాయం కాదని, ప్రజాస్వామ్యానికి, జవాబుదారీతనానికి, న్యాయానికి ప్రతీకగా ఉంటుందని ఆయన అన్నారు. రాజధాని కోసం భూములిచ్చిన రైతుల త్యాగాలను కొనియాడుతూ, గత ప్రభుత్వ హయాంలో వారు ఎదుర్కొన్న ఇబ్బందులను గుర్తుచేసుకున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు సహకారంతో అమరావతిని ప్రపంచస్థాయి రాజధానిగా తీర్చిదిద్దుతామని ఆయన హామీ ఇచ్చారు. యువత ఉద్యోగాల కోసం ఇతర నగరాలకు వలస వెళ్లే అవసరం లేకుండా అమరావతే ఉపాధి అవకాశాల కేంద్రంగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు.

గత ఐదేళ్లలో రాజధాని రైతులు తీవ్రంగా నష్టపోయారని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. 29 వేలకు పైగా రైతులు 34 వేల ఎకరాలకు పైగా భూములను త్యాగం చేస్తే, గత ప్రభుత్వం వారి త్యాగాలను అవమానించిందని మండిపడ్డారు. రైతులు రోడ్లపైకి వచ్చి ముళ్ల కంచెల మధ్య ఆందోళనలు చేయాల్సి వచ్చిందని, లాఠీ దెబ్బలు తిని, కేసులు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. ఎంతోమంది రైతులు ఈ క్రమంలో ప్రాణాలు కోల్పోయారని విచారం వ్యక్తం చేశారు. ఆనాడు రైతులు పడ్డ కష్టాలను ప్రధాని దృష్టికి తీసుకెళతామని, అమరావతే రాజధానిగా ఉంటుందని తాను హామీ ఇచ్చానని, నేడు ఆ మాట నిలబెట్టుకుంటున్నామని పవన్ కళ్యాణ్ తెలిపారు.

# వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు పరిహారం

**(మొదటి పేజీ తరువాయి)**
పశ్చిమగోదావరి జిల్లాలో 15 మండలాల్లో 1,033 హెక్టార్లు, నంద్యాల జిల్లాలో 641, కాకినాడ జిల్లాలో 530, శ్రీసత్యసాయి జిల్లాలో 20 హెక్టార్లలో వరి పంటకు నష్టం వాటిల్లినట్లు చెప్పారు. అలాగే అరటి, బొప్పాయి, మామిడి, తదితర ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లినట్లు తెలిపారు. కృష్ణా, ఏలూరు, కాకినాడ, ఎన్టీఆర్, తిరుపతి, నంద్యాల, పశ్చిమగోదావరి జిల్లాల్లో మొత్తం 138 హెక్టార్లలో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లినట్లు వివరించారు. పిడుగుపాటుకు తిరుపతి జిల్లాలో నలుగురు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో ఇద్దరు చొప్పున, ఏలూరు, నెల్లూరు జిల్లాల్లో ఒక్కొక్కరు మృతి చెందినట్లు చెప్పారు.రబీ సీజన్‌లో 30లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నట్లు పౌర సరఫరాల శాఖ ప్రత్యేక కార్యదర్శి సౌరబ్‌గౌర్ సీఎంకు వివరించారు. ఇప్పటికే 13లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. వర్షాలకు రంగు మారిన ధాన్యం కొనుగోలుకు కూడా చర్యలు తీసుకుంటామని చెప్పారు. దీనిపై చంద్రబాబు మాట్లాడుతూ.. రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ కొనుగోలు చేయాల్సిందేనని గట్టిగా చెప్పారు. అవసరమైతే కేంద్రంతో మాట్లాడి కొనుగోలుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఏ ఒక్క రైతు నుంచి కూడా ధాన్యం కొనలేదన్న మాట రాకూడదని స్పష్టం చేశారు. కాగా, రాబోయే రోజుల్లో కూడా ఆర్టీజీఎస్‌లోని అవేర్ విభాగం, విపత్తు నిర్వహణ సంస్థ నుంచి ఎప్పటికప్పుడు వాతావరణంపై ముందస్తు హెచ్చరికలు జారీ చేస్తుంటామని చెప్పారు. కలెక్టర్లందరూ ఇందుకు అనుగుణంగా ఆయా జిల్లాల్లో విపత్తు మరణాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రస్తుతం ప్రభుత్వం వద్ద మంచి యంత్రాంగం, సాంకేతికత ఉందని, వీటిని సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. వర్షాలకు పలు జిల్లాల్లో దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను పునరుద్ధరించడంలో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది చేసిన కృషిని సీఎం అభినందించారు.అకాల వర్షాల కారణంగా జరిగిన పంట నష్టాన్ని తక్షణమే అంచనా వేయాలని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో మంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పంట నష్టపోయిన రైతులకు రానున్న రోజుల్లో ప్రత్యామ్నాయ పంటలు వేసుకునేలా తగిన సూచనలు ఇవ్వాలన్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని చెప్పారు.

# అన్నదాత సుఖీభవ పథకం కౌలు రైతులకు విస్తరణ

### ప్రతి అర్హులైన రైతు కుటుంబానికి రూ.20,000 ఆర్థిక సాయం

### మూడు విడతల్లో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ

అమరావతి,**మే 05, రిపబ్లిక్ న్యూస్ :-**
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రైతుల సంక్షేమం దిశగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో భూ యాజమాన్య హక్కు లేకున్నా, ఇతరుల భూములను కౌలుకు తీసుకుని సేద్యం చేస్తున్న కౌలు రైతులకు కూడా ఆర్థిక భరోసా కల్పించాలని సంకల్పించింది. ఇప్పటికే అమలులో ఉన్న 'అన్నదాత సుఖీభవ' పథకాన్ని కౌలు రైతులకు సైతం వర్తింపజేస్తున్నట్లు ప్రకటించింది. ఈ పథకం కింద అర్హులైన ప్రతి రైతు కుటుంబానికి ఏటా రూ. 20,000 ఆర్థిక సహాయం అందించాలని నిర్ణయించింది.
ఈ మొత్తాన్ని మూడు విడతలుగా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం కింద అందించే రూ. 6 వేలతో కలిపి ఈ మొత్తం రూ. 20,000 అందజేయనున్నారు. ఈ పథకం కింద అటవీ భూములపై హక్కు పత్రాలు (ఆర్ఓఎఫ్ఆర్) కలిగిన రైతులను కూడా అర్హులుగా గుర్తించనున్నారు.



ఈ పథకం అమలు కోసం క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. వ్యవసాయ, ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖల సహాయకులు, తహసీల్దార్లు, మండల వ్యవసాయ అధికారులు తమ పరిధిలోని కౌలు రైతులు, ఆర్ఓఎఫ్ఆర్ రైతుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హుల జాబితాలను సిద్ధం చేయాలని సూచించింది. ఇలా ధ్రువీకరించిన జాబితాలను మే 20వ తేదీలోగా 'అన్నదాత సుఖీభవ' అధికారిక వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని స్పష్టం చేసింది.ఈ పథకం అమలులో కుటుంబాన్ని (భర్త, భార్య, మైనర్ పిల్లలు) ఒక యూనిట్‌గా పరిగణిస్తారు. కుటుంబంలోని పిల్లలకు వివాహమైతే వారిని ప్రత్యేక యూనిట్‌గా గుర్తిస్తారు. వ్యవసాయం, ఉద్యాన పంటలు, పట్టు పరిశ్రమకు సంబంధించిన పంటలు సాగు చేసే వారందరికీ ఈ పథకం వర్తిస్తుంది.
అయితే, ఈ పథకానికి కొన్ని వర్గాలను మినహాయిస్తున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉన్నవారు, గతంలో లేదా ప్రస్తుతం రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్నవారు, ప్రభుత్వ ఉద్యోగులు, వైద్యులు, ఇంజనీర్లు, న్యాయవాదులు, చార్టర్డ్ అకౌంటెంట్లు, ఆర్కిటెక్టులు వంటి వృత్తి నిపుణులు, గత ఆర్థిక సంవత్సరంలో ఆదాయపు పన్ను చెల్లించిన వారు ఈ పథకానికి అర్హులు కారని ప్రభుత్వం తేల్చి చెప్పింది.

# తెలంగాణ రూపురేఖలు మార్చేస్తాం..

**(మొదటి పేజీ తరువాయి)**
ప్రస్తుతం రాష్ట్రంలో దాదాపు రూ. లక్ష కోట్ల విలువైన కొత్త గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే హైవే ప్రాజెక్టుల పనులు చురుకుగా సాగుతున్నాయని గడ్కరీ వెల్లడించారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ గణనీయంగా పుంజుకుంటుందని, యువతకు ఉపాధి అవకాశాలు భారీగా పెరుగుతాయని, రవాణా సౌకర్యం మరింత మెరుగుపడుతుందని ఆయన పేర్కొన్నారు. రద్దీ తగ్గడం, తక్కువ ఖర్చుతో ప్రయాణం సాధ్యపడటం, లాజిస్టిక్స్ సామర్థ్యం పెరగడం వంటి ప్రయోజనాలు కలుగుతాయని, తద్వారా రాష్ట్ర మౌలిక సదుపాయాల రంగంలో ఇదో కీలక ముందడుగు అవుతుందని వివరించారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని గడ్కరీ స్పష్టం చేశారు.
2014లో తాను మంత్రిగా బాధ్యతలు స్వీకరించే నాటికి తెలంగాణలో జాతీయ రహదారుల పొడవు 2,511 కిలోమీటర్లు ఉండగా, ప్రస్తుతం అది దాదాపు రెట్టింపై 5,000 కిలోమీటర్లకు చేరిందని గడ్కరీ గుర్తుచేశారు. "తెలంగాణలో ఇప్పటికే రూ. 1.5 లక్షల కోట్ల పనులు పూర్తిచేశాం. కానీ ఇది ఆరంభం మాత్రమే. రాబోయే 3-4 ఏళ్లలో మరో రూ. 2 లక్షల కోట్ల విలువైన పనులు చేపడతాం. ఇవి కచ్చితంగా తెలంగాణ రూపురేఖలను మారుస్తాయని నేను విశ్వసిస్తున్నాను," అని ఆయన అన్నారు.
రాష్ట్రంలో చేపట్టిన కొన్ని కీలక గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే ప్రాజెక్టుల వివరాలను గడ్కరీ తెలియజేశారు:
ఇండోర్-హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్‌వే: రూ. 17,000 కోట్లతో 770 కి.మీ.ల ఈ ప్రాజెక్టులో తెలంగాణ పరిధిలో 136 కి.మీ. ఉంటుంది. రాష్ట్రంలోని పనులకు (రూ. 4,500 కోట్లు) నూరు శాతం అనుమతులు పూర్తయ్యాయని, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి జిల్లాల గుండా వెళ్లే ఈ మార్గం మార్చి 2026 నాటికి పూర్తవుతుందని తెలిపారు. దీనివల్ల ఇండోర్-హైదరాబాద్ ప్రయాణ సమయం 20 గంటల నుంచి 10 గంటలకు తగ్గుతుంది.సూరత్-చెన్నై ఎక్స్‌ప్రెస్‌వే: 1,100 కి.మీ.ల ఈ మార్గం తెలంగాణ మీదుగా కూడా వెళ్తుందని, ఇది ఉత్తర-దక్షిణాలను కలుపుతూ కశ్మీర్ నుంచి కన్యాకుమారి కలను నెరవేరుస్తుందని అన్నారు. వచ్చే ఏడాది ఇది




పూర్తవుతుందని, తెలంగాణలో 78 కి.మీ. మేర (పొరుగున ఉన్న కర్నూలును కలుపుతూ) ఉంటుందని చెప్పారు. దీనివల్ల సూరత్-చెన్నై మధ్య దూరం 300 కి.మీ., ప్రయాణ సమయం 28 గంటల నుంచి 17 గంటలకు తగ్గుతుంది.సూర్యాపేట-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే: హైదరాబాద్-విశాఖపట్నం కారిడార్‌లో భాగంగా రూ. 8,000 కోట్లతో 221 కి.మీ.ల ఈ ప్రాజెక్టును చేపట్టారు. ఇందులో 164 కి.మీ. తెలంగాణలోని సూర్యాపేట, ఖమ్మం జిల్లాల గుండా వెళుతుంది. దీనితో హైదరాబాద్-విశాఖ ప్రయాణ సమయం 12 గంటల నుంచి 6 గంటలకు తగ్గుతుంది.
నాగ్‌పూర్-విజయవాడ ఎక్స్‌ప్రెస్‌వే: రూ. 16,000 కోట్లతో 565 కి.మీ.ల ఈ ప్రాజెక్టులో 401 కి.మీ. (రూ. 13,328 కోట్లు) తెలంగాణలోనే ఉంటుంది. ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, హనుమకొండ, వరంగల్, ఖమ్మం జిల్లాల మీదుగా వెళ్లే ఈ మార్గం నాగ్‌పూర్-విజయవాడ మధ్య దూరాన్ని 175 కి.మీ., ప్రయాణ సమయాన్ని 13 గంటల నుంచి 6 గంటలకు తగ్గిస్తుంది. హైదరాబాద్-పనాజీ కారిడార్: రూ. 20,000 కోట్లతో 563 కి.మీ.ల ఈ ప్రాజెక్టులో 90 కి.మీ. తెలంగాణలోని మహబూబ్‌నగర్, జడ్చర్ల మీదుగా వెళ్లి జాతీయ రహదారి 44ను కలుస్తుంది. ఇది హైదరాబాద్-పనాజీ ప్రయాణ సమయాన్ని 15 గంటల నుంచి 7 గంటలకు తగ్గిస్తుంది. వీటితో పాటు భద్రాచలం, బాసర, మేడారం వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాలను జాతీయ రహదారులతో అనుసంధానించనున్నట్లు తెలిపారు. జగిత్యాల-కరీంనగర్ హైవే విస్తరణ పనులను కూడా త్వరలోనే ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రాజెక్టులతో తెలంగాణ-మహారాష్ట్ర మధ్య రోడ్డు రవాణా మరింత సులభతరం కానుందని అన్నారు.కొమరం భీమ్ ఆసిఫాబాద్, పక్కనున్న జిల్లాల వెనుకబాటుతనాన్ని ప్రస్తావించిన గడ్కరీ, వాటి అభివృద్ధికి నీరు, విద్యుత్, రవాణా, మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పారు. మహారాష్ట్రలోని విదర్భ ప్రాంతంలో (రైతుల ఆత్మహత్యలు అధికంగా ఉన్న చోట) తాను చేపట్టిన నీటి సంరక్షణ పనులను గుర్తుచేస్తూ, తెలంగాణలోని డ్యామ్‌లు, నీటి వనరుల పూడికను ఉచితంగా తీసి, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడంలో సహాయం చేస్తానని హామీ ఇచ్చారు.
పర్యావరణ పరిరక్షణ, రవాణా ఖర్చు తగ్గింపు లక్ష్యంగా పెట్రోల్ వాహనాలకు బదులుగా ఎలక్ట్రిక్, సీఎన్‌జీ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని సూచించారు. విద్యుత్ వాహనాల వినియోగం పెరిగితే రవాణా ఖర్చు గణనీయంగా తగ్గుతుందని నితిన్ గడ్కరీ తెలిపారు.ఈ కార్యక్రమంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, తెలంగాణ రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ గారు కార్పొరేట్ విద్యాసంస్థల మానసిక ఒత్తిడి నుంచి విద్యార్థులను రక్షించండి- ఎస్ఎఫ్ఐ

**కర్నూలు ప్రతినిధి మే 0 5 రిపబ్లిక్ న్యూస్**

భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ కర్నూలు నగర కమిటీ ఆధ్వర్యంలో కర్నూలు జిల్లా కలెక్టర్ పి రంజిత్ భాషా కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ కర్నూలు నగర కార్యదర్శి సాయి ఉదయ్ మాట్లాడుతూ కర్నూలు నగరంలో ఉన్నటువంటి కార్పొరేట్ విద్యాసంస్థలు ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఏప్రిల్ 23వ తేదీ ప్రభుత్వం సెలవులు ప్రకటించిన కూడా ప్రభుత్వం నిబంధనలు ఉల్లంఘించి విద్యార్థులకు అదనపు తరగతులు నడుపుతున్నారు. ఇంటర్మీడియట్ లో మంచి మార్కులతో పాసైన విద్యార్థులకు కూడా బెటర్మెంట్స్ పేరుతో తరగతులు నిర్వహిస్తున్నామని చెప్పి బెటర్మెంట్ సిలబస్ చెప్పకుండా ఐఐటి, నీట్ సంబంధించిన సిలబస్ని విద్యార్థులకు బోధిస్తున్నారని విద్యార్థులు ఎస్ఎఫ్ఐ




నాయకులకు తెలియజేశారు. విద్యార్థులు తరగతులకు హాజరు కాకపోతే తల్లిదండ్రులకి ఒత్తిడి చేసి మీ విద్యార్థులు తరగతులకు హాజరు కాకపోతే సిలబస్ మరలా బోధించమని తల్లిదండ్రులు ఆవేదన కలిగిస్తున్నారు. విద్యార్థులని మానసిక ఒత్తిడి నుంచి కాపాడాలని పలుమార్లు ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి ఆర్ఐఓ అయినటువంటి గురువయ్య శెట్టి గారికి తెలియజేసిన పరిష్కారం కాలేదు. అందుకోసమే



జిల్లా కలెక్టర్ గారు అయినా మీరైనా విద్యార్థుల ఆర్తనాదాలు విని మానసిక ఒత్తిడి నుంచి విద్యార్థులని రక్షించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐగా కోరుకుంటున్నాము లేనియెడల పెద్ద ఎత్తున ఉద్యమానికి దిగాల్సి వస్తుందని తెలియజేస్తున్నాము. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కర్నూలు నగర ఉపాధ్యక్షులు అంజి, మల్లేష్, ఆర్యన్ సహాయ కార్యదర్శులు పృధ్వి, ఆదిత్య పాల్గొన్నారు.

# బడి సంచి బరువును తగ్గించనున్న ఏపీ ప్రభుత్వం

**కర్నూలు ప్రతినిధి మే 0 5 (రిపబ్లిక్ న్యూస్)**



రానున్న విద్యా సంవత్సరానికి సంబంధించి రూపు మారిన కొత్త పాఠ్యపుస్తకాలు మండల విద్యా వనరుల కేంద్రాలకు చేరాయి. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత చిన్నారుల పుస్తకాల సంచి (బ్యాగ్) బరువును తగ్గిస్తామని యువగళం పాదయాత్ర సందర్భంగా విద్యాశాఖ మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారు.అందుకు అనుగుణంగా 1, 2 వ తరగతులకు సంబంధించి తెలుగు, ఆంగ్లం, గణితం సబ్జెక్టులను కలిపి ఒకే పాఠ్య పుస్తకంలో, అదే విధంగా దానికి సంబంధించిన వర్క్ బుక్‌లను కలిపి మరొక దానిలో నూతనంగా ముద్రించారు. అంటే ఇక మీదట విద్యార్థులకు రెండు పుస్తకాలు మాత్రమే తమ సంచిలో తీసుకెళ్లాల్సి ఉంటుంది.విద్యాశాఖ అధికారుల వెల్లడి: ఇలా సెమిస్టర్‌ల వారీగా ఏటా రెండు సార్లు పుస్తకాలు అందజేస్తారు. 3, 4, 5 వ తరగతులకు గతంలో నాలుగు పాఠ్య పుస్తకాలు, నాలుగు వర్క్ బుక్‌లు ఉండేవి. వాటితో కలిపి మొత్తం ఎనిమిది పుస్తకాలను విద్యార్థులు మోసుకెళ్లాల్సిన పరిస్థితి వచ్చేది. కానీ ఇప్పుడు మారిన విధానంలో తెలుగు – ఆంగ్లం ఒక పుస్తకంలో, గణితం – ఈవీఎస్ మరో పుస్తకంలో ఉంటాయి. వాటి వర్క్ బుక్‌లూ అలానే ముద్రించారు. అంటే మొత్తంగా కలిపి వీరికి నాలుగు పుస్తకాలే ఇప్పుడు బ్యాగ్‌లో ఉంటాయి. దాంతో చిన్నారులకు బడి సంచి బరువు తగ్గుతుందని విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

# అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న వరి రైతులను ప్రభుత్వము ఆదుకోవాలి

## :రైతు సంఘం డిమాండ్

**మంత్రాలయం మే5(రిపబ్లిక్ న్యూస్):-**



కర్నూలు జిల్లా ఆదోని, కౌతాళం ,కోసిగి ,హొలగుంద , ఎమ్మిగనూరు ప్రాంతాల్లో అకాల వర్షాలు ,వడగండ్ల వాన వల్ల వరి వేసిన రైతులు పూర్తిగా నష్టపోయినారని వారిని ఆదుకోవాలని రైతు సంఘం గా ఆదోని సబ్ కలెక్టర్ వినతిపత్రం ఇవ్వడం జరిగింది.

ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె వెంకటేశులు ,జిల్లా ఉపాధ్యక్షులు కే మల్లయ్య సంయుక్తంగా మాట్లాడుతూ ఏప్రిల్ ఆఖరిలో ,మే మొదటి నెలలో అకాల వర్షాల వల్ల వడగండ్ల వాన వల్ల పంట మీద ఉన్న వరి ధాన్యం వడగండ్ల వాన వల్ల వరి నేలపాలైనది అని వారన్నారు. ఎకరాకి 35 నుంచి 40 బస్తాలు అయ్యే పంట వడగండ్ల వల్ల 15 నుంచి 20 బస్తాలు అయినాయని అన్నారు.10 ,15 బస్తాలు వరి నేలపాలు అయినది. ఈ ధాన్యాన్ని వ్యాపారస్తులు 1400 నుంచి 1600 రూపాయలకు మించి కొనడం లేదు . ప్రభుత్వము ప్రకటించిన మద్దతు ధర 2100 రూపాయలు ఎక్కడ కూడా అమలు చేయడం లేదు. అందుకు ప్రభుత్వమే తడిసిన వరి ధాన్యాన్ని మద్దతు ధర ప్రకారం కొనుగోలు చేసి, నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలని రైతు సంఘం డిమాండ్ చేస్తున్నాం.ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఈరన్న, భాష ,అయ్యప్ప ,దావీదు తదితరులు పాల్గొన్నారు.

# ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న ప్రవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఆగడాలను అరికట్టండి

## -రిపబ్లికన్ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి మహేష్



**కర్నూలు ప్రతినిధి మే 05(రిపబ్లిక్ న్యూస్)**

పబ్లిక్ గ్రీవెన్స్ లో కలెక్టర్ ఫిర్యాదు చేయడం జరిగింది రిపబ్లిక్ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి మహేష్ మాట్లాడుతూ విద్యారంగాన్ని వ్యాపార వేదికగా మార్చుకొని విద్యార్థులపై ఆర్థిక భారం అవుతున్న విద్యాసంస్థలపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని అలాగే జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి ప్రవేట్,కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యా సంవత్సరానికి ముందుగా ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఎటువంటి అనుమతులు లేకపోయినా జిల్లాలో కార్పొరేట్ విద్యాసంస్థలు తమకు ఇష్టం వచ్చినట్లు రంగు రంగు కరపత్రాలను పంచుతూ తప్పుడు ప్రచారము చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను ప్రలోభలకు గురిచేస్తూ ముందస్తు అక్రమ అడ్మిషన్లు చేస్తున్నారని అలాచేస్తున్నా ప్రవేట్,
కార్పొరేట్ విద్యాసంస్థల పట్ల జిల్లా లోని విద్యాశాఖ అధికారులు ఏమి తెలియనట్లుగా వ్యవహరించడాన్ని చూస్తూ ఉంటే ప్రత్యక్షంగా,పరోక్షంగా ప్రవేట్,కార్పొరేట్ విద్యా సంస్థలకు కొమ్ముగాస్తున్నట్టు అర్థం అవుతుందని తెలిపారు. అక్రమ అడ్మిషన్లు చేయడమే కాకుండా కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి ప్రచారం చేసుకుంటున్నారని తెలిపారు. అలాగే విద్యాసంస్థలలో పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, స్కూల్ బ్యాగ్స్, యూనిఫామ్స్, బెల్ట్, షూ, మరియు ఇతర స్టేషనరీలు తప్పనిసరిగా మా స్కూల్లోనే కొనాలి అని విద్యార్థుల తల్లిదండ్రులనూ ప్రలోభాలకు గురి చేస్తున్నారు. ఇలా చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలను గుర్తింపు రద్దు చేయాలని. విద్యా సంస్థల అవలంబిస్తున్న




ధోరణిని నియంత్రించకపోతే భవిష్యత్తులో కార్పొరేట్ విద్యాసంస్థలపై అడ్మిషన్ల పేరుతో పాఠశాలలో పనిచేస్తున్న సిబ్బందిని వేధింపులకు గురి చేస్తున్నారని టార్గెట్ ఇచ్చి మరి ముందస్తు అక్రమ అడ్మిషన్ చేస్తున్నారని ప్రభుత్వం చొరవ తీసుకొని నియంత్రించకపోతే భవిష్యత్తులో చిన్న బడ్జెట్ ప్రైవేటు స్కూల్లో ప్రభుత్వ పాఠశాలలో మూతపడే అవకాశం ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు మధు. ప్రవీణ్. రాజేష్ లు పాల్గొన్నారు.

# నూతన అన్నదానం షెడ్ నిర్మాణం కొరకు విరాళం



**మంత్రాలయం మే5(రిపబ్లిక్ న్యూస్):-**కర్నూలు జిల్లా ప్రసిద్ధి పుణ్యక్షేత్రలలో ఒక్కటి అయినటి వంటి దేవస్థానం శ్రీ నరసింహ ఈరన్న స్వామి దేవస్థానం.కౌతాళం మండలంలోని ఉరుకుంద గ్రామములో వెలిసినటి శ్రీ నరసింహ ఈరన్న స్వామి దేవస్థానం.నూతన అన్నదానం షెడ్ నిర్మాణం కొరకు కర్ణాటక రాష్ట్రము బెంగళూరు వాస్తవ్యులైన కృష్ణవేణి .1,00,001/- ఆన్లైన్ పేమెంట్ ద్వారా డొనేషన్ కౌంటర్ నందు విరాళంగా చెల్లించియున్నారు. ఆలయ అధికారులు దాతలకు శ్రీ స్వామి దర్శనం, స్వామివారి శేష వస్త్రాము, లడ్డూ ప్రసాదాలు,ఆశీర్వాదాలు కల్పించి,బాండు పేపర్, పూలమాలతో సత్కరించారు.ఈకార్యక్రమంలోజూనియర్ అసిస్టెంట్ జె వీరేష్ మరియు ప్రకాష్ స్వామి దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

# కరెంటు స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి

## సిపిఎం నగర కార్యవర్గ సభ్యులు విజయ రామాంజనేయులు

**కర్నూలు ప్రతినిధి మే0 5(రిపబ్లిక్ న్యూస్)**

సిపిఎం పార్టీ ఓల్డ్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో కరెంటు స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని, వివిధ రకాలుగా కరెంటు బిల్లులు పెంచరాదని కోరుతూ కర్నూలు నగరం జోహరాపురం 18 వ వార్డులో శాఖ కార్యదర్శి నాగరాజు అధ్యక్షతన వార్డు ప్రజలతో మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ వద్దు కరెంటు బిల్లులు పెంచరాదని ఉన్న సిపిఎం పార్టీ స్టిక్కర్లు ,ఇండ్ల బతికించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నగర కార్యవర్గ సభ్యులు విజయ రామాంజనేయులు పాల్గొని మాట్లాడుతూ ఎన్నికల ముందు స్మార్ట్ మీటర్లను రద్దు చేస్తామని టిడిపి నాయకులు లోకేష్ , కరెంటు మీటర్ల బిల్లులు పెంచమని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజలకు మాట ఇచ్చి మాట తప్పే విధంగా స్మార్ట్ మీటర్లను ప్రజలకు అంటగట్టే ప్రయత్నాన్ని వ్యతిరేకిస్తూ సిపిఎం పార్టీ ప్రజలను చైతన్యం చేస్తుందని అన్నారు, గత వైసిపి ప్రభుత్వం రైతులను మోసం చేస్తూ రైతులకు స్మార్ట్ మీటర్లు బిగించే ప్రయత్నాన్ని వామపక్ష పార్టీల రైతు సంఘాల పోరాటాల వలన రైతులు చైతన్యవంతంగా ఉన్నారని తెలుసుకున్న టిడిపి నాయకత్వం స్మార్ట్ మీటర్లను పగలగొట్టి మా ప్రభుత్వం వస్తే రద్దు చేస్తామని వైసిపి ప్రభుత్వం అదానితో




ఒప్పందం చేసుకొని రాష్ట్ర ప్రజలను మోసం చేస్తుందని ప్రచారం చేసిన టిడిపి నాయకత్వం అధికారం వచ్చిన తర్వాత గత ప్రభుత్వం అదాని ఒప్పందం కోసం 1750 కోట్ల రూపాయలు లంచం తీసుకుని ఒప్పందం అమలు చేసిందని అమెరికాలో కేసు నమోదైన వాటిని రద్దు చేయకుండా, జైలుకు పంపకుండా మౌనంగా ఉండడమే కాకుండా ఈ ప్రభుత్వము స్మార్ట్ మీటర్లను రైతులకే కాకుండా కమర్షియల్ షాపులకు, ప్రజల నివాసాలకు అమలు చేయడానికి పూనుకోవడం వలన మీ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వానికి లొంగిపోయి అదానికి ఎంతకు అమ్ముడుపోయిందని ప్రజలు మాట్లాడుకుంటున్నారని తెలిపారు, ఇప్పటికైనా తెలుగుదేశం కూటమి ప్రభుత్వం బుద్ధి తెచ్చుకుని నమ్మి ఓట్లు వేసిన ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా అదాని ఒప్పందాన్ని రద్దుచేసి



ప్రజలకు తక్కువ ధరతో నాణ్యమైన కరెంటు ఇవ్వాలని సిపిఎం పార్టీగా డిమాండ్ చేస్తున్నామన్నారు లేని పక్షాన ప్రజలందరిని సమీకరించి పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు, ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ సభ్యులు తిప్పన్న, కృష్ణ, సుధాకర్, మాసూమ్, సంసోను వెంకటేశ్వర్లు, వీరేష్, ప్రసాద్ఇమ్మానేలు మరియు కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# కర్నూలు నగరం జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి హైడ్రో క్లోరిక్ యాసిడ్ లారీ నుండి యాసిడ్ లీక్




**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మే 5)**

కర్నూలు నగరం మీదుగా వెళ్లే బెంగళూరు హైదరాబాద్ జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి సమయంలో ఓ లారీ ట్యాంకరు నుంచి హైడ్రో క్లోరిక్ యాసిడ్ పెద్దఎత్తున లీకైంది. దీనిని గుర్తించిన వాహన డ్రైవరు రహదారిపైనే వాహనం వదిలి దూరంగా వెళ్లిపోయారు. భరింపరాని దుర్గంధం వస్తుండటంతో ఆ దారిన వెళ్తున్న ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. యాసిడ్ కారణంగా చాలామంది శ్వాస అందక అల్లాడిపోయారు. నగరంలో వెంకటరమణ కాలనీ వంతెన పైభాగంలో లారీ ఆగిపోయింది. దీంతో పైవంతెన నుంచి లోకాయుక్త కార్యాలయం ఎదురుగా ఉన్న లక్ష్మీ నరసింహస్వామి ఆర్చి వరకు యాసిడ్ నీళ్లలా ప్రవహించింది. సంతోష్ నగర్ నుంచి తుంగభద్ర నది వరకు ట్రాఫిక్ పెద్దఎత్తున ఆగిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు ట్రాఫిక్ను సర్వీసు రోడ్డుపై మళ్లించారు.

# విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం

## కర్నూలు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా

### ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమానికి 111 ఫిర్యాదులు

**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మే 5)**

కర్నూల్ కొత్తపేటలోని కర్నూల్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ ఆదేశాల మేరకు కర్నూలు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం కు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో అడిషనల్ ఎస్పీ మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 111 ఫిర్యాదులు వచ్చాయి.

**వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని ...**

1) చెత్తబండి ఇప్పిస్తానని చెప్పి రూ. 3 లక్షల 30 వేలు తీసుకొని ధనుంజయ్, జానకీ రాముడులు మోసం చేశారని క్రిష్ణ గిరి మండలం, ఆలం కొండ గ్రామం కు చెందిన బంగారి ఫిర్యాదు చేశారు.

2) రూ. 2 లక్షల విలువ గల కంది పంటను నాశనం చేసి



మా కుటుంబాన్ని మానసికంగా, ఆర్థికంగా ఇబ్బందులకు గురి చేస్తున్న వారి పై చర్యలు తీసుకోవాలని ఓర్వకల్లు మండలం, లొద్ది పల్లె గ్రామానికి చెందిన మాల మాధమ్మ ఫిర్యాదు చేశారు.

3) 10 ఎకరాల ఆస్తి ని ఇద్దరు కొడుకులు పంచుకున్నారని , ఇచ్చిన పెన్షన్ డబ్బులు కూడా తీసుకుంటున్నారని నాకు జీవనాధారం కల్పించాలని ఆస్పరి మండలం, కైరుప్పల గ్రామానికి చెందిన అంగడిశివమ్మ ఫిర్యాదు చేశారు.

4) కర్నూలు, సంతోషనగర్ దగ్గర ఉన్న విజయనగర్ కాలనీలో మార్ట్ గేజ్ చేసిన ఒక ప్రాపర్టీని అమ్ముతామని చెప్పి కొందరు బ్రోకర్లు అడ్వాన్స్ గా డబ్బులు తీసుకొని చాలా మందికి మోసం చేస్తున్నారని కర్నూలు , బాలజీనగర్ కు చెందిన రహిమాన్ ఫిర్యాదు చేశారు.

5) నేను ఇన్ స్టా గ్రాంలో స్టాక్ మార్కెట్ గురించి ఒక ప్రకటన చూశాను. వాట్సాప్ గ్రూప్ లో లింకు ఇచ్చారు. ఇద్దరు వ్యక్తులు నాతో చాట్ చేసి ఒక యాప్ ఇచ్చి అకౌంట్ నంబర్ ఇచ్చి పెట్టిన పెట్టుబడికి లాభాలు చూపిస్తూ ఆ డబ్బులు ఇవ్వాలంటే ఇన్ కమ్ ట్యాక్స్ శాఖ ధృవీకరించడానికి పంపాలని చెప్పి మొత్తంగా రూ. 5 లక్షలు సైబర్ మోసానికి గురి చేశారని కర్నూలుకు చెందిన సునీత ఫిర్యాదు చేశారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సంధర్భంగా కర్నూలు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా హామీ ఇచ్చారు.

ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో సీఐలు శ్రీనివాస నాయక్, ఇబ్రహీం పాల్గొన్నారు.

# కనీస వేతనం 35000 నిర్ణయించాలి

## ఎస్.ము నెప్ప డిమాండ్







**కర్నూల్లో ప్రతినిధి మే 5 (రిపబ్లిక్ న్యూస్)**
కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం 35000 నిర్ణయించాలని, లేబర్ బోర్డులను ఏర్పాటు చేయాలని, ప్రతినెల 1వ తేదీ జీతం చెల్లించాలని, పెండింగ్లో ఉన్న కార్మికుల బకాయి జీతాలు చెల్లించాలని ప్రధానమైన డిమాండ్లతో ఏఐటియుసి జాతీయ సమితి పిలుపు మేరకు కర్నూల్ కలెక్టర్ కార్యాలయం ముందు ఏఐటియుసి నగర అధ్యక్షులు బి వెంకటేష్ నగరఉప ప్రధాన కార్యదర్శి టి రామాంజనేయులు అధ్యక్షతన ధర్నా నిర్వహించడం జరిగింది. అనంతరం కర్నూలు జిల్లా కలెక్టర్ రంజిత్ భాష గారికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ ధర్నా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. ము నెప్ప ఏఐటీయూసీ నగర కార్యదర్శి జి చంద్రశేఖర్. మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయడంలో తీవ్రమైనటువంటి నిర్లక్ష్యం వహిస్తున్నారని వారు విమర్శించారు. కేంద్రంలో ఉన్నటువంటి బిజెపి ప్రభుత్వం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కాకులను కొట్టి గద్దలకేసే పద్ధతుల్లో కార్మికులకు కనీస వేతనం అమలు చేయకుండా కార్పొరేట్లకు పన్నులలోరాయితీలుస్తూ బ్యాంకు అప్పులను రద్దు చేస్తూ ధనవంతులను మరింత ధనవంతులుగా కార్మికులను మరింత పేదవారుగా చేసేటువంటి ఆర్థిక విధానాలను అవలంబిస్తుందని విమర్శించారు.కేంద్ర కార్మిక శాఖ మంత్రి కనీస వేతనం 26,000 నిర్ణయించినప్పటికీ ఎక్కడ 26000 అమలు కావడం లేదని కేవలం 10,,000,, 15,000 కార్మికులకు కడుపు కొడుతున్నారని వారి విమర్శించారు. అందుకే ఏఐటీయూసీ జాతీయ సమితి ఆర్థిక శాస్త్రవేత్త అక్రాయిడ్ ఫార్ములా ప్రకారం ఒక కుటుంబం జీవించడానికి ప్రస్తుతం ఉన్నటువంటి పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలు,విద్యా,వైద్య, ఆరోగ్యం లెక్క కడితే నెలకు 35వేల రూపాయలు కనీస వేతనం నిర్ణయించాలని డిమాండ్ చేశారు. 73 షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్ లో ఉన్నటువంటి కార్మికులకు గత పది సంవత్సరాల నుండి వేతనాలు సవరణ జరగకపోవడం వల్ల లక్షల రూపాయల కార్మికులు నష్టపోతున్నారని కాంట్రాక్టర్లు పెట్టుబడిదారులు లాభపడుతున్నారని కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని ఆవేదన చెందారు. తక్షణమే లేబర్ బోర్డులు ఏర్పాటు చేసి కార్మికులకు జీతాలు చెల్లించని పిఎఫ్, ఈఎస్ఐ అమలు చేయని కాంట్రాక్టర్ల పైన, యాజమాన్యాల పైన సంస్థల పైన ఇన్స్పెక్షన్ చేసేటువంటి అధికారాన్ని కార్మిక శాఖ అధికారులకు కల్పించాలని, అలాగేకార్మిక సంఘాల నాయకులతో వేతనాలకు సంబంధించి చర్చించి కరువు బత్యాన్ని కలిపి కార్మిక వేతనాలు నిర్ణయించాలని, ప్రతి నెల 1వ తేదీ జీతాలు చెల్లించాలని పెండింగ్లో ఉన్న కార్మికుల బకాయి జీతాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఏ. ఈశ్వర్, నాగరాజు, జయరాం రెడ్డి ,బీ.నల్లన్న, కృష్ణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రణీత్, మధు, సురేష్, రాజు మున్సిపల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు మాణిక్యం, నాగేంద్ర, సురేష్ ఆశ వర్కర్స్ యూనియన్ నాయకురాలు రమీజా బి హొటల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

### నిధులు మంజూరైనా..పనులెందుకు ప్రారంభించలేదని

# కమిషనర్ ను ప్రశ్నించిన కలెక్టర్

### 65లక్షల15వ ఆర్థిక సంఘం నిదులు గురించి
### కలెక్టర్ దృష్టికి తెచ్చిన PPSS బృందం



**కర్నూలు ప్రతినిధి మే 5 (రిపబ్లిక్ న్యూస్)**
65 లక్షల 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరై టెండర్ కూడా పూర్తైనప్పటికీ మురికి కాలువల నిర్మాణం ఎందుకు ప్రారంభించడం లేదని నగరపాలక సంస్థ కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ రంజిత్ భాష ప్రశ్నించారు. నగరపాలక సంస్థ పరిధిలోని శివారు కాలనీలో రోడ్లు కాలువలు నిర్మించాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం (%ఇూూ%) నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి,ఎండి యూనిస్, సివి వర్మ, ఎస్ అన్వర్ భాష ల ప్రతినిధి బృందం కలెక్టర్ వినతి పత్రం ఇచ్చారు. రెండేళ్ల క్రితం శాంతినగర్ కాలనీ లో మురికి కాలువల నిర్మాణానికి 15వ ఆర్థిక సంఘం నిధులు మంజీరై, టెండర్ పూర్తి అయిన మురికి కాలువల పనులు ప్రారంభించడం లేదని కలెక్టర్ దృష్టికి తెచ్చారు,ఐదు కాలనీల ప్రజలకు ఉపయోగపడే 100 అడుగుల రిచ్మండ్ కాలనీ రోడ్డు, సంతోష్ నగర్ సమీపంలో రహమత్ నగర్ లో రోడ్లు వేయాలని కలెక్టర్ ను కోరారు. ఆర్థిక సంఘం నిధులు మంజూరైనప్పటికీ పనులు ఎందుకు ప్రారంభించడం లేదని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నగరపాలక సంస్థ కమిషనర్ ను జిల్లా కలెక్టర్ రంజిత్ భాష ప్రశ్నించారు. పట్టణ పౌర సంక్షేమ సంఘం వారు కొన్ని నెలల నుండి తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి పనులు చేయాలని కలెక్టర్ సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో నగరపాలక సంస్థ కమిషనర్ మాట్లాడుతూ కాలువ నిర్మాణానికి రేడియో స్టేషన్ గోడ అడ్డు వస్తుందని.. వారం లోపుగా శాంతినగర్ కాలనీ మురికి కాలువ పనులు ప్రారంభిస్తామని తెలిపారు .

# రైతులను ఆదుకోవాలి

### - మాజీ ఎమ్మెల్యే కాటసాని రామ్ భూపాల్ రెడ్డి,



**పాణ్యం ప్రతినిధి, మే 5 (రిపబ్లిక్ న్యూస్):** మండలం ఆలమూరు గ్రామానికి చెందిన రైతులతో వరి పంటకు గిట్టుబాటు ధర రాకపోవడంతో మరియు పెస్టిసైడ్స్ క్రిమిసంహారక మందులు గత ప్రభుత్వం కంటే ఎక్కువ రేటు ఉండడం వల్ల రైతాంగం కొనలేని పరిస్థితి రేటు లేక విలవిల్లాడుతున్న కౌలు రైతులు తమ గోడును విన్నవిస్తున్న ఆలమూరు రైతులు. నంద్యాల జిల్లా వైయస్సార్సీపి అధ్యక్షులు పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, నంద్యాల జిల్లా ఉపాధ్యక్షులు సద్దల సూర్యనారాయణ రెడ్డి గ్రామ సర్పంచులు కౌలు రైతులు పాల్గొన్నారు. పంటను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ గత ముఖ్యమంత్రి వైఎస్ఆర్సిపి అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో రైతు సంక్షేమానికి పెద్ద పీట వేశామన్నారు సకాలంలో నీళ్లు వదలడం యూరియా,పెస్టిసైడ్ లాంటి నీళ్ల మందుల రేట్లు కూడా తక్కువ ధరలో ఉండేవి ఆర్ బి కే సెంటర్లలో విత్తనాలు,తదితర సామాగ్రి అందుబాటులో ఉండేవి తక్షణమే రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# టౌన్ ప్లానింగ్ అధికారుల అవినీతిపై మంత్రి లోకేష్ కు ట్వీట్




**కర్నూలు క్రైమ్ ప్రతినిధి,(రిపబ్లిక్ న్యూస్ మే 5)**
నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగ అధికారుల అవినీతిపై నగరానికి చెందిన ఎం. మైత్రేయి అనే మహిళా ఇంజినీరు మంత్రి లోకేష్ కు వ్యక్తిగతంగా ట్వీట్ చేసిన విషయం కలకలం సృష్టిస్తోంది.గతనెల 24న ఆమె నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయానికి వెళ్లి సీఎంవోలోని అధికారులకు ఫిర్యాదు చేశారు.తాజాగా మంత్రి లోకేశ్కు కూడా ఆమె ఫిర్యాదు చేసి తన గోడు వెళ్లబోసుకున్నారు. శ్రీనాథ్ అనే వ్యక్తి పేరుపై ఉన్న 22 సెంట్ల భూమిని తీసుకుని దానికి సంబంధించిన టి.డి.ఆర్. ఇవ్వడంలో నగరపాలక సంస్థ అధికారులు అంతులేని కాలయాపన చేస్తున్నారని తెలిపారు. సుమారు రూ.2.2 కోట్ల విలువైన ఆ భూమికి ప్రభుత్వం ఇచ్చే టి.డి.ఆర్.ను ప్రస్తుత మార్కెట్లో విక్రయిస్తే రూ.60లక్షల వరకు వచ్చే అవకాశం ఉందన్నారు. భూమి ఇచ్చినందుకు ఓ పక్కన తాము నష్టపోతుంటే అధికారులు ఆ టి.డి.ఆర్. ఇవ్వడానికి కూడా తీవ్ర వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. టి.డి.ఆర్. బాండ్ విడుదలకుఏడు నుంచి పది శాతం మూముళ్లు ఇవ్వాలని తనకు తెలిసిన వారితో సంకేతాలు పంపుతున్నారని పేర్కొన్నారు. 18 నెలల కిందటే టి.డి.ఆర్. బాండు సిద్ధమైనా తాను డబ్బులు ఇవ్వని కారణంగానే దాన్ని విడుదల చేయకుండా ఆపేస్తున్నారని వాపోయారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 50 రోజుల్లో టి.డి.ఆర్. ఇవ్వాలని ఆదేశాలిచ్చినప్పటికీ వాటిని కార్పొరేషన్ అధికారులు ఏమాత్రం ఖాతరు చేయడంలేదన్నారు. ఆ టి.డి.ఆర్. జారీ అయితే తాము మైత్రి ఇన్ఫ్రా ప్రాజెక్ట్స్ తరఫున ఓ రిక్రియేషన్ కేంద్రం, ఆహారశుద్ధి కేంద్రం ఏర్పాటు చేయాలనుకున్నామని, కార్పొరేషన్ అధికారుల అవినీతి కారణంగా ఇతర ప్రాజెక్టులు కూడా నిలిపివేయాల్సి వచ్చిందన్నారు.ఫలితంగా తాము ఇప్పటికే రూ.40లక్షలు నష్టపోవాల్సి వచ్చిందని తెలిపారు.

# ప్రైవేట్,కార్పొరేట్ విద్యాసంస్థలలో ముందస్తు అడ్మిషన్లు అరికట్టాలి

**-బీసీ విద్యార్థి సంఘం డిమాండ్**

**ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా జిల్లాలో ఏర్పాటు చేసిన ప్రవేట్,కార్పొరేట్ విద్యాసంస్థల ఫ్లెక్సీలు**

**బీసీ విద్యార్థి సంఘంరాష్ట్ర కార్యదర్శి హరికృష్ణ**



**కర్నూలు ప్రతినిధి మే 5 రిపబ్లిక్ న్యూస్ :**
కర్నూలు జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ముందస్తు అడ్మిషన్లు అరికట్టాలని బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో పేపర్ ప్రకటనలో తెలిపారు ఈ సందర్భంగా బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి హరికృష్ణ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కార్పొరేట్ విద్యాసంస్థలు ముందస్తుగా అడ్మిషన్లు చేపట్టడం జరుగుతుందన్నారు.జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రకటనలు చేసిన ఆ ప్రకటనను ఏమాత్రం పట్టించుకోకుండా అడ్మిషన్లు చేస్తూ నగరంలో వివిధ సంస్థలకు సంబంధించిన ప్రచార ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారన్నారు. నారాయణ చైతన్య ఎడిఫై మోంటెస్సోరి, ఢిల్లీ పబ్లిక్,కేశవ రెడ్డి,శ్రీలక్ష్మి, రవీంద్ర స్కూల్స్ కార్పొరేట్ మరియు ఇంటర్నేషనల్ విద్యాసంస్థలు ఇప్పటికే అడ్మిషన్లు పూర్తి చేశారన్నారు. ఈ నెలలో చేసుకుంటే ఒక ఫీజు జూన్ మాసంలో చేసుకుంటే ఒక ఫీజ్ అని తల్లితండ్రులకు మాయమాటలు చెప్పి కార్పొరేట్ విద్యా సంస్థలు అడ్మిషన్లు చేస్తున్నారన్నారు ఇప్పటికే కొన్ని విద్యాసంస్థల్లో అడ్మిషన్లు పూర్తి అయినాయని బోర్డులు కూడా ఏర్పాటు చేశారన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు పేపర్ ప్రకటనలకు మాత్రమే పరిమితమయ్యారు తప్ప ఎక్కడ కూడా ప్రత్యక్షంగా సందర్శించింది లేదన్నారు జిల్లా విద్యాశాఖ అధికారులు, ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ అధికారులు తక్షణమే కార్పొరేట్ విద్యాసంస్థలను సందర్శించి ఏవైతే అడ్మిషన్లు చేస్తున్నారో వాటి పైన చర్యలు తీసుకొని సీజ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం జిల్లా నాయకులు మనోహర్, శివ, ఎల్ల రాముడు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

### ఖాళీ బోర్లకు కొత్త మోటర్లు వేసి, బీసీ,ఎస్సీ,ఎస్టి,మైనార్టీ కాలనీలకు

# పుష్కలంగా నీటిని విడుదల చేసిన వేంపెంట గ్రామ సర్పంచ్ వై.మాణిక్యమ్మ.



**పాములపాడు మే 5 రిపబ్లిక్ న్యూస్:-**
పాములపాడు మండలంలోని, వేంపెంట గ్రామంలోని ఖాళీగా ఉన్న బోర్లకు సర్పంచ్ వై.మాణిక్యమ్మ ఆధ్వర్యంలో గ్రామ నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, కంభం.మోహన్ గౌడ్, వార్డు మెంబర్ గంటా.రమేష్, వై.దానమయ్య, తదితర నాయకులతో కలిసి 7 హెచ్ పి కొత్త మోటర్లు వేసి, కాలనీలకు పుష్కలంగా నీటిని విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా వేంపెంట గ్రామ సర్పంచ్ వై.మాణిక్యమ్మ మాట్లాడుతూ ఈ వేసవి కాలంలో గ్రామ ప్రజలకు ఎటువంటి నీటి సమస్య లేకుండా బ్రహ్మంగారిమఠం దగ్గర ఉన్న బోరుకు కొత్త మోటార్ వేసి బీసీ. ఎస్టి కాలనీలకు మరియు మసీద్ దగ్గర ఉన్న బోరుకు కొత్త మోటార్ వేసి మైనార్టీ, ఎస్సీ, తదితర కాలనీలకు కొత్త పైప్ లైన్ ద్వారా కుళాయిలకు పుష్కలంగా నీటిని విడుదల చేయడం జరిగిందన్నారు. నిధుల కొరత ఉన్నా కూడా,పెద్ద గ్రామమైన కూడా, గ్రామ నాయకులతో, కార్యకర్తలతో, గ్రామ ప్రజలతో కలిసి ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కారం చేస్తూ, అభివృద్ధి పథంలో నడిపిస్తున్న గ్రామ సర్పంచ్ వై.మాణిక్యమ్మ ను, గ్రామ నాయకులను ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు అభినందించడం ఎంతో గర్వకారణం అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు మూల.లెనిన్ బాబు, నెత్తికొప్పుల లింగన్న, బాలస్వామి, ఆదిరెడ్డి, గంటా.మధు సుధాకర్, ధర్మవరం మల్లికార్జున నాయుడు, లక్ష్మణ్ నాయక్, శంకర్ రాములు, దుర్గయ్య, స్వామన్న నాయక్, తదితర నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది.

## తిరుమల శ్రీనివాసుడిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని దంపతులు



**బనగాపల్లి, మే 5 రిపబ్లిక్ న్యూస్:-**
బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సతీమణి కాటసాని జయమ్మ సోమవారం తిరుమల తిరుపతి వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో బనగానపల్లె నియోజకవర్గ ప్రజలు, రైతులు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నట్లు ఆయన తెలిపారు.

### ఆశా వర్కర్స్ కు ఈ శ్రమ్ కార్డులపై

# అవగాహన సదస్సు






**కర్నూలు ప్రతినిధి మే 5 (రిపబ్లిక్ న్యూస్)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశానుసారంగా, అధ్యక్షులు మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కర్నూలు గౌరవ జి. కబర్థి సూచనల మేరకు, బి. లీలా వెంకట శేషాద్రి,కార్యదర్శి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కర్నూలు శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షులు వెంకట హరినాథ్ సోమవారం న్యాయ సేవా సదన్ నందు ఆశ వర్కర్స్ కు ఈ శ్రమ్ కార్డులపై అవగాహన సదస్సు నిర్వహించారు. అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం వారోత్సవాల్లో భాగంగా వివిధ రంగాల్లో పనిచేస్తున్న ప్రతి ఒక్కరికి ఈ శ్రామ్ కార్డులు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ శ్రామ్ కార్డుల వల్ల లభించే ఉపయోగాలను మీకు తెలిసిన కార్మికులకు తెలియజేసి ఈ శ్రామ్ కార్డులు పొందేలా కృషి చేయాలని కోరారు.జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ శాంతి కళ గారు మాట్లాడుతూ తమ డిపార్ట్మెంట్ లోని అందరు ఆశ వర్కర్స్ ఈ శ్రామ్ కార్డ్స్ పొందారని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ లక్ష్మి అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ గారు ఆశ వర్కర్స్ కు ఈ శ్రామ్ కార్డులు ఈ శ్రామ్ పోర్టర్ లో ఎలా నమోదు చేయాలో వివరించారు. ఈ కార్డులు పొందిన వారికి ప్రభుత్వం అందించే అన్ని రకాల సామాజిక భద్రతా పథకాలు వివిధ సంక్షేమ పథకాలు వర్తింపజేయడం జరుగుతుందని తెలిపారు. మరియు ప్రతి ఒక్క కార్మికునికి ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద రెండు లక్షల ప్రమాద మరణ బీమా ఉచితంగా కల్పించడం జరుగుతుందని తెలిపారు. హెల్త్ డిపార్ట్మెంట్ లీగల్ ఆఫీసర్ సుమలత తదితరులు పాల్గొన్నారు.

## సంచార చికిత్స కార్యక్రమాన్ని జిల్లా నోడల్ ఆఫీసర్ తనిఖీ



**కర్నూలు, ప్రతినిధి మే 05(రిపబ్లిక్ న్యూస్)**
సోమవారం కోడుమూరు కో లోకేటెడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో జరుగుచున్న సంచార చికిత్స కార్యక్రమన్ని జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు తనిఖీ చేశారు .అనంతరం ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా మాట్లాడుతూ చేతులను సబ్బుతో శుభ్రంగా కడుకుంటె అంటూ వ్యాధులు రాకుండ నివారించగల ఒక సులభమైన మార్గమని తెలిపారు.ముఖ్యంగా తినడానికి ముందు,మల,మూత్ర,విసర్జన చేసిన తరువాత,ముక్కు చీదిన తరువాత,ఏదేని తినుబండరాలను చేతిలో తీసుకొనేముందు మరియు తినే ముందు అనారోగ్యంగా ఉన్నవారికి సేవచేసే ముందు తరువాత,వంట వండే ముందు కూరగాయలు లేక ఏదేని వంట సంగ్రి తాకే ముందు, ,తుమ్మిన,దగ్గినా,ముక్కులను శు భ్రం చేసినా తరువాత, పిల్లల మలం శుభ్రం చేసిన తరువాత,పిల్లలు ఆటలాడిన తరువాత,ఎదిగిన పిల్లలైతే శానిటరీ ప్యాడ్స్ మార్చుకున్న తరువాత మరియు ప్యాడ్ పడవేసిన తరువాత,జంతువులు వాటి వ్యర్థాలు తాకిన తరువాత సబ్బుతో చేతులు శుభ్రంగా కడుక్కోవాలని తెలిపారు,అనంతరం ప్రతిజ్ఞ చేయించినారు.ఈ కార్యక్రమంలో వైద్యులు శ్రీమంత్ మాదన్న ,ఆరోగ్య విస్తరణ అధికారి నరసప్ప , పర్యవేక్షకులు ఉమా బాయి,ఆరోగ్య కార్యకర్త సువర్ణ, మగ ఆరోగ్య కార్యకర్తలు జయకుమార్, కిరణ్ కుమార్ సింగ్,ఆశా కార్యకర్తలు మరియు ప్రాజెక్షనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.

# చేతుల పరిశుభ్రత పట్ల ప్రతి ఒక్కరూ శ్రద్ధ చూపాలి: డా అడ్డాల

**కాకినాడ జిల్లా ప్రతినిధి మే 5 రిపబ్లిక్ న్యూస్**

స్థానిక రమణయ్యపేట వద్ద ఉన్న అడబాల ట్రస్ట్ కార్యలయం లో కాకినాడ ఐడిఎ సభ్యుల చే ప్రపంచ చేతి శుభ్రత దినోత్సవం సంధర్భంగా విద్యార్థుల కు మహిళల కు చేతుల శుభ్రతా పద్దతుల పట్ల అవగాహన కల్పించారు. ఈ సంధర్భంగా కాకినాడ ఐడిఎ కార్యదర్శి డా అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ”సరైన చేతుల పరిశుభ్రతను ప్రోత్సహించడానికి ప్రతి సంవత్సరం మే 5న ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవాన్ని జరుపుకుంటారని,మనం చేసే ప్రతీ పని కి మన చేతులను ఉపయోగిస్తామని - తినడం, వంట చేయడం, శుభ్రం చేయడం, ఫోన్‌లను ఉపయోగించడం వంటి పనుల వలన మన చేతులు లక్షలాది క్రిములను తీసుకుంటాయని అన్నారు. చేతులు కడుక్కోవడం గురించి ప్రజలకు అవగాహన



కల్పించడం వలనఅతిసారం మరియు జీర్ణశయాంతర ఇన్ఫెక్షన్లు వంటి వ్యాధుల వ్యాప్తిని నిరోధించవచ్చని అన్నారు.అనంతరం చేతులను ఎలా శుభ్రం చేసుకోవాలో చేసి చూపించారు... చేతుల ప్రతి భాగాన్ని అనగా అరచేతులు, వేళ్లు, బొటనవేళ్లు, గోళ్లు మరియు మణికట్టులను - పూర్తిగా శుభ్రం చేయడానికి 7 దశల చేతి పరిశుభ్రతను అనుసరించాలని,20-30 సెకన్ల పాటు స్క్రబ్ చేయాలని, సూక్ష్మక్రిములు, ధూళి మరియు సంభావ్య వైరస్‌లను సమర్థవంతంగా తొలగించడానికి కనీసం 20 సెకన్ల పాటు మీ చేతులను స్క్రబ్ చేయాలని కోరారు.అడబాల రత్న ప్రసాద్ మాట్లాడుతూ”మనం చేతులు సరిగ్గా కడుక్కోవడం ఎంత ముఖ్యమో ప్రజలకు గుర్తు చేయడానికి ఈ రోజు ఒక ప్రపంచవ్యాప్త ప్రచారం అని, క్రిములు, వైరస్‌లు మరియు ఇన్‌ఫెక్షన్ల వ్యాప్తిని ఆపడానికి మన వద్ద ఉన్న ఉత్తమ సాధనాలు శుభ్రమైన చేతులే అని అన్నారు.ఈ కార్యక్రమం లో రెడ్నం రాజా, నిమ్మకాయల వెంకటేశ్వర రావు, మహిళలు ,విద్యార్థులు ,పాల్గొన్నారు.

# అకాల వర్షాలకు దెబ్బతిన్న రైతులందరినీ ప్రభుత్వం ఆదుకుంటుంది

## రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

**కాకినాడ జిల్లా ప్రతినిధి మే 5, (రిపబ్లిక్ న్యూస్)**

కాకినాడ జిల్లా జగ్గంపేట మే 5:జగ్గంపేట మండలం కాట్రావులపల్లి గ్రామంలో అకాల వర్షాలకు కల్లల్లో తడిసిపోయిన ధాన్యాన్ని పరిశీలించిన రాష్ట్ర సివిల్ సప్లయిస్ శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అకాల వర్షాలకు దెబ్బతిన్న రైతులందరికీ అన్ని విధాలా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇచ్చిన సూచనలతో జగ్గంపేట మండలంలో అపార నష్టం కలిగిన ప్రాంతాన్ని జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూతో కలిసి పర్యటిస్తున్నామని అన్నారు. ముఖ్యంగా దళారులు వద్ద తక్కువ రేటుకే ధాన్యాన్ని అమ్మి మోసపోవద్దని ప్రభుత్వం మీ వద్ద ధాన్యం కొనుగోలు చేసి మద్దతు ధర ఇస్తుందని అన్నారు.





ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ 250 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని కోరారని అవసరం అయితే 350 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేస్తామని మంత్రి అన్నారు. రెండు రోజులపాటు ఆగితే మీకు కనీస మద్దతు ధాన్యాన్ని కల్పించి కొనుగోలు చేస్తామని సంచులు కూడా అవసరమైన మేర అందిస్తామని మంత్రి రైతులకు హామీ ఇచ్చారు. ప్రతిపక్షాలు దారుణంగా విమర్శలు చేస్తున్నాయని గత ప్రభుత్వం కన్నా ఈ సంవత్సరం 11 లక్షల మెట్రిక్ టన్నుల పైగా ధాన్యాన్ని కొనుగోలు చేశామని రాష్ట్ర చరిత్రలో మొట్టమొదటిసారి 11,300 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసేమని అన్నారు. తడిసిన ధాన్యంపై సాయంత్రం నాలుగు గంటలకు ప్రభుత్వ యంత్రాంగంతో సమీక్ష ఏర్పాటు చేసి దీనిపై తగు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, ప్రభుత్వ అధికారులు కూటమి నాయకులు, రైతులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఓర్వకల్లు మండలం గుడుంబాయి తండాలో నాటు సారా స్థావరాలపై

# ప్రోహిబిషన్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ చంద్రహాస్ ఆకస్మిక దాడులుదాడులు

**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మే 5)**

ప్రోహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్ కర్నూలు పరిధిలో ఓర్వకల్లు మండలం గుడుంబాయి తండాలో నాటు సారా స్థావరాలపై దాడులు నిర్వహించడం జరిగినది.ఈ దాడులలో సుమారు 16 లీటర్ల నాటు సారాకు తయారీకి పనికి వచ్చు బెల్లం ఊటను ధ్వంసం చేయడం జరిగినది.తదుపరి 45 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకోవడం జరిగినది. ఈ దాడులలో అసిస్టెంట్ ప్రోహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కర్నూలు రాజశేఖర్ గౌడ్ మరియు ప్రోహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ ఇన్స్పెక్టర్ చంద్రహాస్ వారి సిబ్బందితో ఈ దాడులు నిర్వహించడమైనది తదుపరి గ్రామస్తులను ఉద్దేశించి నాటు సారా అమ్మడం కానీ తయారు చేయడం కానీ రవాణా చేయడం కానీ చట్టరీత్యా నేరము అని తెలుపుతూ ఈ దాడులలో గుర్తించినటువంటి వ్యక్తుల జాబితాను వివరించి వీరందరినీ త్వరలో అరెస్టు చేస్తామని దానికి మీ వంతు సహాయ సహకారాలు అందించాలని తెలియజేస్తూ



ఇకమీదట నాటుసారా తయారు చేయడం అనేది పూర్తిగా మానివేయాలని లేనిచో చట్టాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరిస్తూ పీడీ యాక్ట్ ను ప్రయోగించుటకు కూడా ఎటువంటి సందేహము ఉండదని తెలియజేస్తూ నాటు సారా లేని గ్రామంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ప్రభుత్వం చేయుచున్న కృషికి అందరూ సహకరించాలని తెలియజేయడమైనది. దర్యాప్తులో ఈ క్రింది వారు నాటు సారా తయారు చేయువారిగా తెలియడం వలన వీరందరి పై కేసు నమోదు చేయడం జరిగినది.



**వారి వివరములు**

1) మాధవత్ దన్ను నాయక్ తండ్రి రాముడు నాయక్ ఏ మోటో నాయక్

2) నానవత్ రాజునాయక్ తండ్రి నాగ్యా నాయక్

3)మాధవత్ మద్దిలేటి నాయక్ పొట్ల నాయక్

4) నానవత్ రమేష్ నాయక్, తండ్రి రామోజీ నాయక్

పై వారి పై కేసు నమోదు చేయడమైనది వీరినిత్వరలో అరెస్టు చేయడం జరుగుతుంది పై వారు కాకుండా మరికొంత మంది కూడా వున్నారు వారిపై కూడా చర్యలు తీసుకోవడమౌతుంది.

## అత్యాధునిక వసతులతో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ

# బ్లడ్ స్టోరేజ్ సెంటర్ ప్రారంభం

**ప్రారంభించిన మంత్రులు ఎన్ఎండి ఫరూక్, బీసీ జనార్దన్ రెడ్డి, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ**







**నంద్యాల ప్రతినిధి, మే 05, రిపబ్లిక్ న్యూస్ :-**

నంద్యాల పట్టణంలోని కేసి కెనాల్ కాంపౌండ్ లోని మైనర్ ఇరిగేషన్ కార్యాలయ భవనంలో అత్యాధునిక వసతులతో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బ్లడ్ స్టోరేజ్ సెంటర్ ను మంత్రులు ఎన్ఎండి ఫరూక్, బీసీ జనార్దన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, జిల్లా ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా, జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ లు ప్రారంభించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన నంద్యాల పట్టణంలో ఎంతో మంది ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు చికిత్స కోసం రావడం జరుగుతుందని. రక్తం దొరకక ఏ ఒక్కరూ ఇబ్బంది పడకూడదనే లక్ష్యంతో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ప్రెసిడెంట్, గౌరవ జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి నేతృత్వంలో బ్లడ్ స్టోరేజ్ సెంటర్ ను ఏర్పాటు చేసి సమాజానికి అందుబాటులోకి తీసుకురావడం చాలా సంతోషకరమన్నారు.

రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి మరొక ప్రాణం కాపాడేందుకు తోడ్పాటు అందించాలన్నారు. జిల్లా విభజన తర్వాత నంద్యాలలో బ్లడ్ బ్యాంక్ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఏదైనా అపాయకర పరిస్థితిలో రోగులకు బ్లడ్ కావాలంటే కర్నూలుకు వెళ్లాల్సిన పరిస్థితి లేకుండా ఇక్కడి నుండే సరఫరా చేయవచ్చన్నారు. స్థానికంగా బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేయడం ద్వారా నంద్యాల చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రజలకు అత్యవసర పరిస్థితుల్లో ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుని రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో సకల సదుపాయాలతో బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేయడం ఆనందదాయకమన్నారు. గతంలో బనగానపల్లెలో బ్లడ్ బ్యాంక్ క్యాంపులు ఏర్పాటు చేయాలని కోరితే రెడ్ క్రాస్ సంస్థ సానుకూలంగా స్పందించిందని మంత్రి పేర్కొన్నారు.

జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో రక్తం అవసరం ఉన్న వారికి సరైన సమయంలో అందించడానికి ఇతర జిల్లాలోని రక్తనిల్వ కేంద్రాల మీద ఆధార పడకుండా మన జిల్లాలోనే రక్త నిల్వ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలనే ఉద్దేశ్యంతో రెడ్ క్రాస్ సంస్థ వారి సహకారంతో రక్త నిల్వ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో కూడా ప్రతి నియోజకవర్గంలో కూడా ఒక సబ్ యూనిట్ ను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ అన్నారు. ప్రజలు అందరూ రక్త నిల్వ కేంద్రం యొక్క సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదే విధంగా రెడ్ క్రాస్ సైన్యాన్ని ఒకటి తయారు చేసి యూత్ రెడ్ క్రాస్, జూనియర్ రెడ్ క్రాస్ గా ఏర్పడి జిల్లాకు ఏ విపత్తు వచ్చినా సమర్థవంతంగా ఎదుర్కొనేలా కూడా సమాయత్తం చేస్తున్నామన్నారు. అదే విధంగా ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన జిల్లా మంత్రులకు కలెక్టర్ జిల్లా యంత్రాగం తరపున కృత్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో డిఆర్ఓ రాము నాయక్, ఆర్డీఓ విశ్వనాథ్, డిఇఓ జనార్ధన్ రెడ్డి, హాస్పిటల్ సూపర్నెంట్ డాక్టర్ మల్లీశ్వరి, డీసీ హెచ్ ఎస్ డాక్టర్ జఫ్రుల్ల, సెట్కూర్ సిఇఓ డాక్టర్ వేణుగోపాల్, డ్రగ్ ఇన్స్పెక్టర్ ఖలందర్, రెడ్ క్రాస్ చైర్మన్ దస్తగిరి, సెక్రటరీ వెంకట సుబ్బయ్య, వైస్ చైర్మన్ మారుతి కుమార్, కోశాధికారి నాగేశ్వరరావ్, జాయింట్ సెక్రటరీ మమతా రెడ్డి, ఎగ్జిక్యూటివ్ కమిటి సభ్యులు ఉస్మాన్ బాషా, నాగ శేషయ్య, మద్దిలేటి, నాగరాజు, చైతన్య, యాకూబ్, సురేంద్ర, రెడ్ క్రాస్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఏపీలో నేటి నుంచి ఆధార్ క్యాంపులు

**కాకినాడ జిల్లా ప్రతినిధి మే 5 రిపబ్లిక్ న్యూస్ :**

ఏపీ రాష్ట్ర వ్యాప్తంగా నేటి నుంచి రెండు విడతల్లో ఆధార్ క్యాంపులను నిర్వహించనున్నట్లు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. 2025, మే5 నుంచి 8వ తేదీవరకు ఒక విడత, 12 నుంచి 15వ తేదీ వరకు మరో విడతలో ఈ క్యాంపులను నిర్వహించనున్నట్లు తెలిపింది. 5 నుంచి 7, 15 నుంచి 17 ఏళ్ల మధ్య వయసుగల వారు ఈ ప్రత్యేక క్యాంపుల్లోని సేవలను వినియోగించుకోవాలనిసూచించింది.



# కార్మికులకు పనికి తగ్గ వేతనం ఇవ్వాలి:ఏఐటీయూసీ

**మంత్రాలయం మే5(రిపబ్లిక్ న్యూస్):-**



మేడే కార్యక్రమం సందర్భంగా పెద్దకడబూరు మండలము కల్లుకుంట గ్రామంలో సీనియర్ నాయకులు ఇస్మాయిల్ ఇంటి నుండి బస్టాండ్ వరకు ర్యాలీగా వచ్చి సీనియర్ నాయకులు ఇస్మాయిల్ చేతుల మీదుగా జండా ఆవిష్కరణ చేయడం జరిగింది ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి వీరేష్ నాయుడు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆంజనేయ ముఖ్య అతిథులుగా హాజరు కావడం జరిగింది.మే డే జెండా కార్యక్రమం ఏఐవైఎఫ్ జాఫర్ పటేల్ రాజు అధ్యక్షతన జరిగింది వారు ఏఐవైయఫ్ నాయకులు మహమ్మద్ జాఫర్ పటేల్ సీనియర్ నాయకులు ఇస్మాయిల్ చంద్ర హనుమంతు మాట్లాడుతూ 4,00,000 మంది కార్మికులు ఎనిమిది గంటల పనిదినం కోసం సమ్మెలు నిర్వయించారు. చికాగోలో, పోలీస్ అధికారులపై బాంబు విసిరినప్పుడు శాంతియుత నిరసన హింసగా మారింది.దీని ఫలితంగా అధికారులు,పౌరులు ఇద్దరు మరణించారు. ఈ విషద సంఘటన కార్మికుల హక్కులకు శక్తీవంతమైన సంగిభావన్నీ రికేంత్తించింది.1889లో స్పెషలిస్ట్ గ్రూపులో ట్రెండ్ యూనియన్ల ప్రపంచ సమైక్య మే 1ని కార్మికులను గౌరవించడానికి హై మార్కెట్ సంఘటనలను స్మరించుకోవడాని ఒక రోజు మే డే ని ప్రకటించింది అప్పటినుంచి మే దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా కార్మికుల దినోత్సవం గా జరుపుకోవడం జరుగుతుంది అని వారన్నారు ఈ కార్యక్రమంలో గోపాల్,ఇర్ఫాన్ పటేల్, నాగేంద్ర, నాగేష్, షేక్ శ వలి, రాజు, హనుమంతు, చేదు నాగరాజు,సర్దాజ్ పటేల్,బోయ అడివప్ప,నరసింహులు తిక్కన్న ముద రంగప్ప రాముడు రెక్కల గిడ్డయ్య శాఖ కార్యదర్శి పటేల్ నరసింహులు తదితర కార్మికులు పాల్గొన్నారు

## షర్మిల కర్నూలు జిల్లా పర్యటనను

# విజయవంతం చేయండి

## - సిటీ ప్రెసిడెంట్ షేక్ జిలాని భాష



**కర్నూలు ప్రతినిధి మే 5 (రిపబ్లిక్ న్యూస్):**ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు శ్రీమతి వైఎస్ షర్మిల రెడ్డి కర్నూలు జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని కర్నూల్ నగర కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ జిలాని భాష గారు తెలియజేశారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన సమీక్ష సమావేశంలో జిలాని భాష మాట్లాడుతూఆంధ్ర ప్రదేశ్ లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసే దిశలో భాగంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో షర్మిలమ్మ గారి పర్యటనలలో భాగంగా కర్నూలు జిల్లాలో ఈనెల 11వ తేదీన సాయంత్రం మూడు గంటలకు షర్మిలమ్మ కార్యకర్తల సమావేశమునకు విచ్చేయుచున్నారని కనుక ఈ సమావేశమునకు కాంగ్రెస్ నాయకులు, నియోజక వర్గాల కోఆర్డినేటర్లు, జిల్లా కాంగ్రెస్ అనుబంధ సంస్థల నాయకులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, నగర కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొని ఈ కార్యక్రమమును విజయవంతం చేయవలెనని జిలాని భాష తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎం సుధాకర్ బాబు గారు, కోడుమూరు కోఆర్డినేటర్ అనంతరత్నం మాదిగ, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎన్సి బజారన్న, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు షేక్ ఖాజా హుస్సేన్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మహేంద్ర నాయుడు, జిల్లా మహిళా కాంగ్రెస్ ఎస్ ప్రమీల, కాంగ్రెస్ నాయకులు ఎండ్లూరి లాజరస్, షేక్ రియాజుద్దీన్, సయ్యద్ ఖాద్రీ పాష, అబ్దుల్ హై, ఐఎన్టియుసి ఆర్ ప్రతాప్ మొదలగు వారు పాల్గొన్నారు.

## రితం డాన్స్ అండ్ ఫిట్నెస్ స్టూడియోను

# ప్రారంభించిన టీజీ వెంకటేష్

**కర్నూలు,ప్రతినిధి మే 5 (రిపబ్లిక్ న్యూస్)**



నగరంలోని ప్రకాష్ నగర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన రితం డాన్స్ అండ్ ఫిట్నెస్ స్టూడియోను రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వైద్యులు డాక్టర్ కన్నా, వీరేంద్ర, స్టూడియో నిర్వాహకులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ మాట్లాడుతూ కర్నూల్ నగరంలో రితం డాన్స్ అండ్ ఫిట్నెస్ స్టూడియో ఏర్పాటు చేయడం అభినందనీయమని చెప్పారు. ఇలాంటి సంస్థలు ఏర్పాటు చేయడం ద్వారా మన సంస్కృతి సాంప్రదాయాలను కాపాడే అవకాశం ఉందని వివరించారు .డ్యాన్స్ మరియు ఫిట్నెస్ లలో సాధన చేయడం వల్ల శరీరానికి తగిన వ్యాయామం లభించడంతో పాటు ఐక్యా పెరుగుతుందని వివరించారు .సంస్థ నిర్వాహకులకు రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ శుభాకాంక్షలు తెలియజేశారు

# పేకాటరాయుళ్ల అరెస్ట్

## రూ 7170 స్వాధీనం

**బండి ఆత్మకూరు,మే 5, (రిపబ్లిక్ న్యూస్):బి** మండల పరిధిలోని ఈర్నపాడు, సింగవరం గ్రామాల మధ్య పేకాట ఆడుతున్నట్లు రాబడిన సమాచారం మేరకు ఎస్సై జగన్మోహన్ సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడులు నిర్వహించారు.ఈ దాడుల్లో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.7170 రూపాయలతో పాటు పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సోమవారం సాయంత్రం తెలిపారు. వీరిలో ఈర్నపాడు గ్రామానికి చెందిన గడకారి శ్రీనివాసులు, దూదేకుల మౌలాలి, పేరం తిరుపతయ్య, ఎర్రన్నలను అదుపులోకి తీసుకొని రిమాండ్ కు తరలించినట్లు ఆయన వెల్లడించారు.

## 12వ వేతన సవరణ కమీషన్ వెంటనే ప్రకటించాలి:APTF






**చిత్తూర్ జిల్లా ప్రతినిధి 5 మే, 2025( రిపబ్లిక్ న్యూస్ ):**ప్రభుత్వ ఉద్యోగులకు వెంటనే 12వ వేతన సవరణ కమీషన్ ప్రకటించాలని జిల్లా APTF అధ్యక్షులు డిమాండ్ చేశారు."ఉద్యోగుల,ఉపాధ్యాయుల పలు అపరిష్కృత సమస్యల పై APTF రాష్ట్ర శాఖ ఇచ్చిన పిలుపు మేరకు, జిల్లా వ్యాప్తంగా జరిగిన ధర్నా కార్యక్రమంలో భాగంగా ఈ రోజు చిత్తూర్ పాత తాలూకా కార్యాలయం వద్ద APTFశ్రేణులు ధర్నా నిర్వహించారు" . ఈ ధర్నా కార్యక్రమం లో అధ్యక్షులు గోపినాథ్ పాల్గొని మాట్లాడుతూ GO 117 కు ప్రత్యామ్నాయంగా తీసుకొచ్చిన 9 రకాల పాఠశాలలు గందరగోళంగా తయారైందని...పాత విధానం లోనే 1-5తరగతుల ప్రాథమిక పాఠశాలలు,1-8ప్రాథమికొన్నత పాఠశాలలు,6-10ఉన్నత పాఠశాలలు విధానం కొనసాగించాలని డిమాండ్ చేశారు,ప్రధాన కార్యదర్శి ముక్తార్ అహ్మద్ మాట్లాడుతూ PRC పెండింగ్ బకాయిలు,DA లు విడుదల చేయాలనీ.12వ వేతన సవరణ కమిషన్ ఏర్పాటు చేసి మధ్యంతర భృతి 30%ఇవ్వాలని కోరారు. "ఈ ధర్నా కార్యక్రమం అనంతరం తహసీల్దార్ గారికి వినతి పత్రం సమర్పించారు...ఈ కార్యక్రమం లో జగదీష్, శివశంకర్,మధు,వేణు ఆఫ్జాల్,లక్ష్మీపతి,కృష్ణమూర్తి, సుబ్రహ్మణ్యం,ప్రభాకర్,ఇబ్రహీం, RUTA అధ్యక్షులు మునీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# హిందూసనతన ధర్మం చిన్నప్పుడే నేర్పడం అవసరం

### విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర మీడియా కన్వీనర్ మాళిగి భానుప్రకాష్

**కర్నూలు, ప్రతినిధి మే 5 (రిపబ్లిక్ న్యూస్)**
విశ్వ హిందూ పరిషత్ కర్నూలు జిల్లా,శ్రీ అభయాంజనేయ స్వామి ప్రఖండలోని హరిశ్చంద్ర శరీన్ నగర్, శ్రీ సద్గురు త్యాగరాజ సీతారామాలయంలో గత ఆరు రోజులుగా" విజ్ఞాన వికాస్ బాల సంస్కార కేంద్రం " ఆధ్వర్యంలో జరుగుతున్న " బాబాలికల వేసవి శిక్షణా శిబిరం " ముగింపు సభకు ముఖ్య అతిథి గా విచ్చేసినన విశ్వ హిందూ పరిషత్ దక్షిణాంధ్ర రాష్ట్ర మీడియా కన్వీనర్ మాళిగి భాను ప్రకాష్ మాట్లాడుతూ%ూ%. మొక్కై వంగనిది మానై వంగదన్న నానుడిని అనుసరించి చిన్నప్పుడే సనాతన హైందవ ధర్మం లోని సంస్కృతి, సంప్రదాయం, దేశభక్తి, దైవభక్తి, సామాజిక సమరసత వంటి సుగుణాలను అలవాటు చేయడానికి చిన్నప్పుడే బీజం పడాలని, తద్వారా రేపు పిల్లలంతా పెద్దవారై, దేశం కోసం ధర్మం కోసం పనిచేసేలా వారిని సంఘటితం చేయడానికి ఇటువంటి బాలబాలికల వేసవి శిక్షణ శిబిరాలు ఉపయోగపడతాయని తెలియజేశారు.అంతకు ముందు ఉదయం 11:00 గం.లకు విజ్ఞాన వికాస్ బాల సంస్కార కేంద్రం పిల్లలు జైశ్రీరామ్%ూ%జై జై శ్రీరామ్ అంటూ శ్రీ సద్గురు త్యాగరాజ సీతారామాలయం



ఇరువైపులా ఉన్న వీధులగుండా వారే తయారు చేసుకున్న చిన్న పల్లకీలో భగవాన్ "రామ్ లల్లా " చిన్న విగ్రహాన్ని ఊరేగించారు.11:30 విశ్వ హిందూ పరిషత్ కర్నూలు జిల్లా కార్యదర్శి ఈపూరి నాగరాజు గారి జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన బాలబాలికల వేసవి శిక్షణా శిబిర సభలో మాట్లాడుతూ జిల్లా మాతృశక్తి కన్వీనర్ శ్రీమతి పావని అక్కయ్య గత 17 సం.లుగా ఇక్కడ ఉన్న పిల్లలకు ప్రతి ఆదివారం ఉ 9:30 గం లో నుండీ 11:00 గం.ల వరకు విజ్ఞాన వికాస్ బాల సంస్కార కేంద్రం పేరుతో పిల్లలకు హిందూ దేవీ,దేవతల శ్లోకాలు,నిత్య సాధన శ్లోకాలు,సుభాషితాలు,తెలుగు పద్యాలు, నీతి కథలు,దేశభక్తి గీతాల వంటివి నేర్పిస్తూ వీశేషంగా గత నెల 29/4/25 వతేదీ నుండి నిన్నటి 4/05/25 వరకు ప్రతి రోజు పిల్లకు శిక్షణను ఇచ్చి వారిచే ఈ రోజు ప్రదర్శన చేయించడం చాలా ఆనందం దాయకమని అన్నారు, శ్రీ విశ్వ హిందూ పరిషత్ (వెంకటరమణ కాలని పరిధి) వేంకటేశ్వర స్వామి ప్రఖంధ కార్యదర్శి కరణం సుధాకర్ మాట్లాడుతూ ఇంత మంది పిల్లలు చక్కగా శ్లోకాలు,పాటలు,పద్యాలు పాడుతుంటే తనకు తాన చిన్నతనం గుర్తుకు వస్తున్నదని, తాము 1 వ పట్టణ పోలీసుస్టేషన్ దగ్గర మెయిన్ బజార్ లో ఉన్న రామాలయం లో మాళిగి నారాయణా చార్యులు,మాళిగి వ్యాసరాజ్ గార్ల ఆధ్వర్యంలో బాల సంస్కార కేంద్రంలో శిక్షణ పొందామని, అప్పుడు నేర్చుకున్నవి ఇప్పటికీ మర్చిపోలేదని చిన్నప్పుడు నేర్చుకున్నందుకే తమకు అవన్నీ ఇంకా గుర్తున్నాయని చెప్పి తెలియజేశారు. అనంతరం పిల్లలందరికీ విచ్చేసిన అతిథుల చేతులు మీదుగా బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమం విశ్వహిందూ పరిషత్ మాతృశక్తి కన్వీనర్ శ్రీమతి మాలికి పావని నిర్వహించారు, ప్రసాద వితరణ తో కార్యక్రమం సమాప్తమైంది.ఈ కార్యక్రమంలో శ్రవణ్,సహస్ర,60 మంది బాలబాలికలు పాల్గొన్నారు.

# 'నమస్తే'తో వ్యర్థ పికర్స్‌కు గుర్తింపు

### - నగరపాలక ప్రజారోగ్య అధికారి డాక్టర్ డా. కె.విశ్వేశ్వర్ రెడ్డి








**కర్నూలు ప్రతినిధి మే 05(రిపబ్లిక్ న్యూస్)**
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజేడ్ శానిటేషన్ ఎకోసిస్టమ్ (నమస్తే) పథకం వ్యర్థాలను ఏరుకునే పికర్స్‌లకు గుర్తింపును ఇచ్చి, ప్రభుత్వాల పథకాల సద్వినియోగానికి ఎంతగానో దోహదపడుతుందని నగరపాలక ప్రజారోగ్య అధికారి డాక్టర్ డా. కె.విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో 'నమస్తే' కార్యక్రమ ప్రత్యేక క్యాంపు నిర్వహించారు. ప్రజారోగ్య అధికారి మాట్లాడుతూ.. వ్యర్థాలను సేకరించే వ్యక్తులు (వేస్ట్ పికర్స్), పారిశుద్ధ్య కార్మికులను (సఫాయి కర్మచారి) అధికారికంగా గుర్తించి, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు నమస్తే పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రారంభించాయన్నారు. వ్యర్థాలను సేకరించే వ్యక్తులకు సురక్షితమైన, గౌరవప్రదమైన, స్థిరమైన జీవనోపాధిని అందించడం జరుగుతుందని, ఇందుకోసం గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ చేయించడం వంటివి చేపట్టాల్సి ఉంటుందన్నారు. నమస్తే వెబ్సైట్లో ప్రొఫైల్ పెట్టాక వారికి అధికార గుర్తింపు వస్తుందన్నారు. తద్వారా వారికి భద్రత, భరోసా కల్పించడంతో పాటు వారి సామర్థ్యాన్ని పెంపొందించడానికి వృత్తి నైపుణ్యం మెరుగుదలకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే వ్యక్తిగత రక్షణ పరికరాల కిట్లు, ఆయుష్మాన్ భారత్ కింద వైద్యం పొందవచ్చని, వ్యర్థాలను సేకరించే వాహనాల కొనుగోలుకు రూ.5 లక్షల వరకు రాయితీతో కూడిన రుణాలు పొందవచ్చన్నారు. కాబట్టి వ్యర్థాలను సేకరించేవారు ప్రభుత్వాల నుండి ప్రయోజనాలు పొందేందుకు నమస్తే పథకంలో నమోదు కావాలని కోరారు. దీని కోసం స్థానిక శానిటేషన్ ఇన్స్పెక్టర్ లేదా నమస్తే కార్యక్రమం ఆర్ఓ 9492469964 నెంబర్‌కు కాల్ చేయవచ్చని ప్రజారోగ్య అధికారి సూచించారు.
అనంతరం క్యాంపులో పాల్గొన్న దాదాపు 100 మంది వేస్ట్ పికర్స్ తమ ప్రొఫైల్ నమోదు చేసుకుని, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా కొరకు దరఖాస్తు చేసుకున్నారు. అంతకన్నాముందు పికర్స్‌కు నమస్తే కార్యక్రమంపై నమస్తే కార్యక్రమ (స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్) స్టేట్ కోఆర్డినేటర్ అనిల్, ప్రాజెక్ట్ డైరెక్టర్ చిట్టిబాబులు అవగాహన కల్పించారు.

# బంగారు కుటుంబాలను ఆదుకునేందుకు మార్గదర్శిల జాబితాను సిద్ధం చేయండి

### ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలపై కార్యాచరణ ప్రణాళిక నివేదికలు ఇవ్వండి

### ఇళ్ల నిర్మాణాలకు పొసెషన్ సర్టిఫికెట్లు జారీ చేయండి

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా




**నంద్యాల ప్రతినిధి, మే 05, రిపబ్లిక్ న్యూస్ :-**పి4 సర్వే ద్వారా గుర్తించిన బంగారు కుటుంబాలను ఆదుకునేందుకు మార్గదర్శికులను అన్వేషించి మండలాల వారీగా జాబితాను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ అభివృద్ధి అంశాలపై సమావేశం నిర్వహించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్, డిఆర్ఓ రామునాయక్, డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ పేదరికం నిర్మూలనకు పి4 (ప్రజా-ప్రైవేట్-ప్రజల భాగస్వామ్యం) సర్వే ద్వారా మండలాల వారీగా గుర్తించిన 43,021 బంగారు కుటుంబాలను దత్తత తీసుకొని చేయూత నిచ్చేందుకు మార్గదర్శకులను గుర్తించాలన్నారు. ఇప్పటివరకు 458 మంది మార్గదర్శకులను మాత్రమే గుర్తించారని, మండలాల వారీగా సంపన్న కుటుంబాల మార్గదర్శకులను గుర్తించి నివేదికలు ఇవ్వాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలపై నియోజకవర్గాల వారీగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి నివేదికలు ఇవ్వాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అన్ని శాఖలు తమ పరిధిలోని లక్ష్యాల సాధనపై సంబంధిత మండల స్థాయి అధికారులతో సమావేశాలు నిర్వహించుకొని నిర్దేశిత ప్రగతి సాధించేలా కృషి చేయాలన్నారు. బ్యాంకింగ్ రంగంలో గత ఏడాది కంటే ఈ ఆర్థిక సంవత్సరం 19 శాతం అదనపు రుణాలు ఇచ్చేందుకు ప్రణాళిక నివేదికలు ఇవ్వాలన్నారు.జిల్లాలో 26,139 మంది ఇళ్లు లేని నిరుపేదలు ఉన్నారని ఇప్పటివరకు 12,651 ఇళ్లకు మాత్రమే పొసెషన్ సర్టిఫికెట్లు మంజూరు చేశామని... మండలాల వారీగా సంబంధిత లబ్ధిదారుల డేటాను తీసుకొని పొసెషన్ సర్టిఫికెట్లు ఇచ్చేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తహశీల్దార్లను కలెక్టర్ ఆదేశించారు. ఇళ్ల నిర్మాణంలో చాలా వెనుకబడి ఉన్నామని ఆర్డీఓలు, తహశీల్దార్లు బాధ్యతగా తీసుకొని గృహ నిర్మాణ పనులు ప్రారంభించేందుకు లబ్ధిదారులను ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు.

# "విజయవాడాలొ గర్జించిన బహుజన సేనా" మహాధర్నా విజయవంతం







**చిత్తూర్ జిల్లా ప్రతినిధి 5 మే 2025 (రిపబ్లిక్ న్యూస్ ):**
బహుజన సేనా రాష్ట్ర అధ్యక్షులు శ్రీ చందు చలో విజయవాడా అనీ ఇచ్చిన పిలుపు మేరకు , నిన్న ఆదివారం చిత్తూర్ జిల్లా నుండి ఉద్యమ యాత్ర మొదలుపెట్టిన , బహుజన సేనా శ్రేణులు, ఈ రోజు విజయవాడా అలంకార్ టాకీస్ దగ్గర గాంధీ నగర్ ధర్నా చౌక్ చేరుకొన్నారు, బహుజన సేన రాష్ట్ర అధ్యక్షులు శ్రీ చందు సభని ఉద్దేశించి మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2014 సంవత్సరంలో ఎస్సీ, ఎస్టీ కేసులు సత్వర పరిష్కారం కొరకు జస్టిస్ పున్నయ్యా కమిషన్ సిఫార్సులు గౌరవిస్తూ ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టాన్ని బలపరిచే విధంగా, 'రాష్ట్రంలోని పోలీసు వ్యవస్థలో ప్రత్యేకంగా ఎస్సీ ఎస్టీ సెల్లు ఏర్పాటు చేసి ప్రత్యేక డిఎస్పి లను నియమించారు. ఈ ప్రత్యేక ఎస్సీ, ఎస్టీ సెల్ డిఎస్పి ల ద్వారా బాధితులకు విచారణ సమయంలో రక్షణ మరియు ముద్దాయిల అరెస్టు చూపడం ఛార్జ్ షీట్ దాఖలు చేయడం, ఎస్సీ ఎస్టీ బాధితులకు ఉపశమనం లభించడం వంటి సాహెతుకమైన కార్యాచరణ జరుగుతూ, బాధిత వర్గాలకు ఈ ఎస్సీ ఎస్టీ సెల్ ఎంతోగానో అండగా ఉపయోగపడింది, ఈ నేపథ్యంలో ఎన్నికల ముందే 2024 సంవత్సరంలో 98 మంది ఎస్సీ ఎస్టీ సెల్ డిఎస్పి లను రద్దుచేసి ఎస్సీ, ఎస్టీ బాధిత వర్గాలకు తీరని అన్యాయం చేశారు. ' దీని ప్రభావం వల్ల ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు మరియు జనరల్ కేసులు, ఒకే డివిజనల్ డిఎస్పి ఆఫీసర్ విచారణ చేయడం వల్ల ఎస్సీ, ఎస్టీ కేసులు ప్రాధాన్యతే తగ్గుతూ, ఎస్సీ, ఎస్టీ కేసులు విచారణకాల పరిమితి జాప్యం అవుతుంది, ఇందుకోరాకు రాష్ట్ర ప్రభుత్వం సత్వరమే ఆంధ్రప్రదేశ్ పోలీస్ డిపార్ట్మెంట్లో ప్రత్యేక ఎస్సీ, ఎస్టీ సెల్లో డిఎస్పీలకు పోస్టింగులను ఇచ్చి రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ సెల్ డిఎస్పి లను నియమించాలని కోరారు!

# పెన్షన్ల పంపిణీలో అన్ని జాగ్రత్తలు: మంత్రి

**అమరావతి,మే 05, రిపబ్లిక్ న్యూస్ :-** పింఛను పంపిణీలో అనేక జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు- ఏపీ సమాచారశాఖ మంత్రి పార్థసారథి తెలిపారు. లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా పింఛను అందించే బాధ్యత అధికారులదేనని చెప్పారు. అమరావతిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాల పంపిణీలో ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. అకాల వర్షాలు, పంట నష్టంపై సీఎం సమీక్ష నిర్వహించారని, కొన్ని చోట్ల ధాన్యం తడిసినట్లు- కలెక్టర్లు సీఎం దృష్టికి తీసుకెళ్లారని చెప్పారు. రంగు మారిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని సీఎం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఏ రైతూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ధాన్యం ఎలా ఉన్నా ప్రభుత్వమే వాటిని కొనుగోలు చేస్తుంది. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని పార్థసారథి తెలిపారు.

# 11 మంది రైతులకు 32.71 ఎకరాల డి నోటిఫై పత్రాల పంపిణీ

### దీర్ఘకాల అపరిస్కృత భూ సమస్యలకు పరిష్కారం

### జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి గణియా

**నంద్యాల ప్రతినిధి, మే 05, రిపబ్లిక్ న్యూస్ :-**
చుక్కల భూములు, 22 ఏ1 భూములు నిషేధిత జాబితాలో వుండి దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించి 11 మంది రైతులకు డీనోటిఫై చేసిన క్లియరెన్స్ పత్రాలను అందజేసామని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించి సంబంధిత డి నోటిఫై పత్రాలను రైతులకు పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భూసమస్యలకు సంబంధించి ఫిర్యాదులు స్వీకరించి నిషేధిత జాబితా నుండి 11 మంది రైతులకు 32.71 ఎకరాల విస్తీర్ణం గల డి నోటిఫై పత్రాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. భూ నిషేధిత జాబితాలో ఉన్న చుక్కల భూములు, 22 %ూ%1 భూములు గత ఐదారు సంవత్సరాల నుండి వివిధ సమస్యలతో పెండింగ్లో ఉండి పరిష్కారం కానీ సమస్యలను సంబంధిత రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారం చూపామన్నారు. ఇందుకు సంబంధించి సంబంధిత తహశీల్దార్లు, ఆర్డీఓలు, సెక్షన్స్ సిబ్బంది త్వరితగతిన భూ సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. బాధిత సర్వే నంబర్ల రైతులను ఐజిఆర్ఎస్ నిషేధిత జాబితాలో డీనోటిఫై చేయాలని సంబంధిత రిజిస్ట్రార్ లను కలెక్టర్ ఆదేశించారు. అదే విధంగా వెబ్ ల్యాండ్ పోర్టల్ లో అప్డేట్ చేయడంతో పాటు డీనోటిఫై పత్రాలు ఇచ్చిన నిషేధిత భూముల నుండి తొలగించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తహశీల్దార్లను ఆదేశించారు.దీర్ఘకాలిక భూ సమస్య



బాధితులైన 11 మందికి కలెక్టర్ డి నోటిఫై పత్రాలను అందజేశారు. అందులో సిరివెళ్ల మండలం, సిరివెళ్ల గ్రామ నివాసి నాయక్ నజీర్, %ం/శీ%.నబీ సాహెబ్, సర్వే నంబరు.143 లో 4.27 ఎకరాలు, సిరివెళ్ల మండలం, బోయలకుంట గ్రామ నివాసి కంచర్ల వీరారెడ్డి, సర్వే నంబరు.506 లో 1.48 ఎకరాలు, నంద్యాల అర్బన్ మండలం, మూలసాగరం గ్రామ నివాసి ఎన్.రవికాంత్ రెడ్డి, సర్వే నంబరు.684-బి1ఎలో 0.25 ఎకరాలు, సర్వే నంబరు.687-2ఎలో 0.22 ఎకరాలు, రుద్రవరం




మండలం, ఎర్రగుడిదిన్నె గ్రామ నివాసి ఆలమూరు పెద్దకేశవులు, ఆలమూరు చిన్నకేశవులు %ం/శీ%.చెన్నయ్య, సర్వే నంబరు.489-3లో 2 ఎకరాలు, సర్వే నంబరు.489-4లో 0.21 ఎకరాలు, నంద్యాల రూరల్, చాపిరేవుల గ్రామ నివాసి ఎర్రబోలు బ్రహ్మేశ్వర రెడ్డి, సర్వే నంబరు.183/1ఎలో 0.67 ఎకరాలు, ఆళ్లగడ్డ మండలం, పి.చింతకుంట్ల గ్రామ నివాసి ఈడిగ పెద్ద నరసింహుడు, %ం/శీ%.ఈ.చిన్న నరసింహుడు, సర్వే నంబరు.501/ఎలో 2.44 ఎకరాలు, కొలిమిగుండ్ల మండలం, తొల్లమడుగు భానుముక్కల గ్రామ నివాసి మొలకల గోపాల్ రెడ్డి, మొలకల లక్ష్మీదేవి, సర్వే నంబరు.619/1 లో 2.11 ఎకరాలు, బనగానపల్లె మండలం, కృష్ణగిరి గ్రామ నివాసి చింతమాను మద్దిలేటి, సర్వే నంబరు.163లో 1.51 ఎకరాలు, బనగానపల్లె మండలం, కృష్ణగిరి గ్రామ నివాసి ఈడిగ సుబ్బమ్మ, సర్వే నంబరు.17లో 6.50 ఎకరాలు, బనగానపల్లె మండలం, బనగానపల్లె గ్రామ నివాసి కె.గుర్రెడ్డి, %ం/శీ%.లేట్ గురెడ్డి, నాగ పినాకిని రెడ్డి, %ం/శీ%.లేట్ నాగేశ్వర రెడ్డి, సర్వే నంబరు.153-1ఎలో 2.50 ఎకరాలు, మిడ్తూరు మండలం, రోళ్లపాడు గ్రామ నివాసి బిడుగు %ం/శీ%.మున్నయ్య, సర్వే నంబరు.618/1లో 8.55 ఎకరాలకు డి నోటిఫై ఉత్తర్వుల పత్రాలను సంబంధిత బాధిత రైతులకు కలెక్టర్ పంపిణీ చేశారు. అనంతరం రైతులు మాట్లాడుతూ తమ సంతోషాన్ని, భావోద్వేగంతో వెలిబుచ్చుతూ కలెక్టర్ కు కృతజ్ఞతలు తెలిపారు.

# ఐదుగురు పేకాట ఆడుతుండగా అరెస్ట్

**- అదిలాబాద్ రెండవ పట్టణ సీఐ సిహెచ్ కరుణాకర్ రావు**





**ఆదిలాబాద్ జిల్లా మే 05 (రిపబ్లిక్ న్యూస్) బ్యూరో:-** అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా రూపుమాపలనే జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ ఆదేశాల మేరకు, ఈరోజు ఆదిలాబాద్ రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో లారీ అసోసియేషన్ ఏరియా వద్ద పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేయగా సంఘటన స్థలంలో పేకాట ఆడుతూ ఐదుగురు నిందితులు పట్టుబడ్డారని తెలిపారు. వారి వద్ద నుండి రూ 8,800/- నగదు, నాలుగు మొబైల్ ఫోన్లు, నాలుగు ద్విచక్ర వాహనాలు, స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. వారి పేర్లు సిరాజ్ ఖాన్, షేక్ హసేన్, సందీప్, షబ్బీర్ ఖాన్, షేక్ మునీర్ వీరందరూ లారీ ఓనర్లు డ్రైవర్లు గా ఉన్నారని తెలిపారు. ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు ఆదిలాబాద్ రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించడానికి లేదని, నిర్వహించిన వారిని ఉపేక్షించేది లేదని, వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# రికార్డుల నిర్వహణ సక్రమంగా నిర్వహించాలి

**- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్.**

**బోథ్ పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ.**

**పోలీస్ స్టేషన్ పరిసరాలు, రికార్డులు, సిబ్బంది పనితీరు పై తనిఖీ.**

**పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు అడ్డుకట్ట వేయాలని ఆదేశం.**





**అదిలాబాద్ జిల్లా మే 05 (రిపబ్లిక్ న్యూస్ బ్యూరో):-** సోమవారం సాయంత్రం జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ బోథ్ పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మొదటగా పోలీస్ స్టేషన్ పరిసరాలను తనిఖీ చేసి పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న వాహనాలపై వాటి ప్రస్తుత స్థితిగతులపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించకుండా గట్టిగా గస్తీ నిర్వహిస్తూ ఆరికట్టాలను సూచించారు. పోలీస్ స్టేషన్ లో నమోదైన కేసుల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. రికార్డుల నిర్వహణ తప్పకుండా నవీకరిస్తూ ఉండాలని, ఎటువంటి పెండెన్సీ లేకుండా రికార్డుల నిర్వహణ చేయాలనే సూచించారు. పోలీస్ స్టేషన్లో రిసెప్షన్ సెంటర్ ను పరిశీలించి బాధితుల పట్ల వ్యవహరించే తీరును, ఫిర్యాదులను పరిష్కరించే తీరును పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడుతూ క్రమశిక్షణతో విధులను నిర్వర్తించాలని సూచించారు. ప్రజలతో మమేకమై సత్సంబంధాలను మెరుగుపరుచుకుంటూ, ఎలాంటి రిమార్కులు లేకుండా, ప్రజలలో పోలీసుల కీర్తి ప్రతిష్టలను పెంపొందించే విధంగా విధులను నిర్వర్తించాలని సూచించారు. డయల్ 100, బ్లూ కోర్ట్ సిబ్బంది గ్రామ గ్రామాన సందర్శిస్తూ సమాచార సేకరణలో ముందుండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బోత్ సిఐ వెంకటేశ్వర రావు, ఎస్సై ప్రవీణ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# శిక్షణ వల్ల పిల్లలకు ప్రత్యేక కళ లలో ప్రావీణ్యం లభిస్తుంది

**- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్.**

**ఆదివాసీల అభివృద్ధి విద్యార్థి దశ నుండి ప్రారంభం కావాలనే సదుద్దేశంతో ప్రత్యేక సమ్మర్ క్యాంప్ ప్రారంభం**

**ఘనంగా పోలీస్ సమ్మర్ క్యాంప్ ప్రారంభం.**

**ఆటల వల్ల శారీరక, మానసిక దృఢత్వం లభిస్తుంది.**

**ఆదిలాబాద్ లో ఉత్సాహంగా పాల్గొన్న 200 మంది విద్యార్థిని, విద్యార్థులు, చిన్నారులు.**

**జిల్లాలో నాలుగు చోట్ల 470 మంది విద్యార్థులతో ఏఆర్ హెడ్ క్వార్టర్స్, ఇచ్చోడా, ఇంద్రవెల్లి, నార్నూర్ లలో ఏకకాలంలో ప్రారంభం.**

**వేసవి కాలంలో విద్యార్థులకు ఆటవిడుపుగా సమ్మర్ క్యాంప్.**

**చెడు అలవాట్లకు, వ్యసనాలకు అలవాటు కాకుండా ఉండడానికే పోలీసుల ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపు నిర్వహణ.**

**అన్ని అంశాలలో పాల్గొనాలని జిల్లా ఎస్పీ పిలుపు.**










**ఆదిలాబాద్ జిల్లా మే 05 రిపబ్లిక్ న్యూస్ బ్యూరో:-** వేసవికాలంలో పిల్లలకు ఆటవిడుపుగా ఉండాలని చెడు వ్యసనాలకు అలవాటు కాకుండా ఉండడానికి, ప్రత్యేకంగా ఆదివాసీలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని చిన్ననాటి నుండి పిల్లలకి, విద్యార్థినీ విద్యార్థులకు వ్యాయామం శిక్షణ అందిచి ఉన్నత స్థానాలకు ఎదగాలనే సదుద్దేశంతో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ గారి సొదూర దృష్టి ఆలోచన తో జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో నాలుగు చోట్ల ఏకకాలంలో నెలరోజుల పాటు సమ్మర్ క్యాంపును ఈరోజు ప్రారంభించడం జరుగుతుందని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ తెలియజేశారు. ఈ సమ్మర్ క్యాంపు ఆదిలాబాద్ జిల్లా నందు ఆదిలాబాద్ పట్టణంలోని ఏఆర్ హెడ్ క్వార్టర్స్ (200), ఇచ్చోడ పోలీస్ స్టేషన్(120), ఇంద్రవెల్లి పోలీస్ స్టేషన్(100), నార్నూర్ (50) పోలీస్ స్టేషన్లో నందు ఈరోజు ఏకకాలంలో ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ఈ సమ్మర్ క్యాంపు నందు జిల్లా వ్యాప్తంగా దాదాపు 470 మంది విద్యార్థులు పాల్గొని వివిధ అంశాల నందు శిక్షణను తీసుకోనున్నారు. మొదటగా జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించి, జిల్లా ఎస్పీ మాట్లాడుతూ యువత మరియు చిన్నారులకు ఒకే అంశంపై పదేపదే శిక్షణను అందించడం ద్వారా వారు ఆ కళనందు నిష్ణాతులై ఉన్నత స్థానానికి ఎదుగుతారని తెలిపారు. ముఖ్యంగా ఆటల వల్ల పిల్లలకు విద్యార్థినీ విద్యార్థులకు మానసిక శారీరక దృఢత్వం లభిస్తుందని తెలిపారు. సమ్మర్ క్యాంపు ద్వారా పిల్లలకు ఆటవిడుపుగా ఉంటుందని అన్ని రంగాలలో సరైన శిక్షణను అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమ్మర్ క్యాంపు నందు పోలీసుల ఆధ్వర్యంలో యోగ, కరాటే, కబడ్డీ, క్రికెట్, వాలీబాల్, బాస్కెట్ బాల్, పిఈటీ తోపాటు సమ్మర్ క్యాంపులో పలు రోజులు పోలీస్ స్టేషన్ సందర్శన, నిర్వహణ, జైలు సందర్శన, పోలీస్ ఆధ్వర్యంలో ఉండే ఆయుధాల ఉపయోగం, వాటి పనితీరు పై, జిల్లా పోలీసులు తీసుకున్నటువంటి కటోర శిక్షణ పై ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. తదుపరి చిన్నారులు ప్రదర్శించినటువంటి కరాటే సందర్శించి, ప్రత్యేకంగా కరాటే, యోగ, పి ఈ టి నిష్ణాతులచే ప్రత్యేకంగా శిక్షణను అందించనున్నట్లు తెలిపారు. చిన్నారులతో కలిసి క్రికెట్, వాలీబాల్ ఆడి సమ్మర్ క్యాంపును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి బి సురేంద్రరావు, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, ఎల్ జీవన్ రెడ్డి, ఇన్స్పెక్టర్లు సిహెచ్ కరుణాకర్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు డి వెంకటి, ఎన్ చంద్రశేఖర్, కరాటే మాస్టర్ ప్రవీణ్, యోగ మాస్టర్, పీఈటి సందీప్, రిజర్వ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలి

**- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ - సోమవారం గ్రీవెన్స్ డే నిర్వహణ.**



**ఆదిలాబాద్ జిల్లా మే 05 రిపబ్లిక్ న్యూస్ బ్యూరో:-** ప్రతి సోమవారం స్థానిక పోలీసు ముఖ్య కార్యాలయం నందు ప్రజా ఫిర్యాదుల రోజును నిర్వహించడం జరుగుతుందని ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్ ముఖ్య కార్యాలయం నందు 15 మంది ఫిర్యాదుదారులు హాజరుఐ సమస్యలను జిల్లా ఎస్పీకి వివరించారు, నిన్న వెంటనే జిల్లా ఎస్పీ సమాధిత పోలీసు అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలను జారీ చేశారు. ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. ఫిర్యాదుదారుల పట్ల గౌరవంగా వ్యవహరిస్తూ ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించినప్పుడే పోలీసుల పట్ల ఉన్న గౌరవం పతక స్థాయికి చేరుకుంటుందని, ప్రజలలో పోలీసుల పై నమ్మకం, కీర్తి ప్రతిష్టలు పెంపొందించబడతాయని తెలిపారు. సుదూర ప్రాంతాల ఫిర్యాదుదారులు జిల్లా పోలీసు కార్యాలయానికి చేరుకోలేని వారు మెసేజ్ యువర్ ఎస్పి కార్యక్రమంలో ద్వారా 8712659973 నంబర్కు వాట్సప్ ద్వారా సంప్రదించాలని తెలిపారు. ఈరోజు స్వీకరించిన ఫిర్యాదులలో కుటుంబ తగాదాలు, భార్యాభర్తల మధ్య సమస్యలు, వివిధ కేసుల నమోదు పై ఉన్న సమస్యలపై జిల్లా ఎస్పీకి పలువురు ఫిర్యాదులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిసి కొండ రాజు, ఫిర్యాదుల విభాగం అధికారిని జైస్వాల్ కవిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి ధనసరి అనసూయ (సీతక్క),





**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి ధర్మారం, (రిపబ్లిక్ న్యూస్)**

పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలోని తెనుగువాడ నుండి ఎండపల్లి బై పాస్ రోడ్డు వరకు 3.20 కోట్ల రూపాయల నిధులతో బిటి రోడ్డు నిర్మాణానికి రాష్ట్ర పంచాయతీ రాజ్ మరియు మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి వర్యులు ధనసరి అనసూయ (సీతక్క) ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ తో కలిసి శంకు స్థాపన చేశారు అనంతరం ధర్మపురి నియోజకవర్గం లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని శంకుస్థాపన చేశారు ధర్మారం కు వచ్చిన తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ మరియు మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి వర్యులు ధనసరి (సీతక్క), కు ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణ రావు రామగుండము ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ కలెక్టర్ కోయ శ్రీహర్ష లు రాజారాంపల్లి వద్ద గణ స్వాగతం పలికారు ఈ కార్యక్రమంలో అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

# ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుంది

## - దయచేసి ఎవరు కూడా ఆత్మహత్యలు చేసుకోవద్దు.

**తల్లిదండ్రులు దయచేసి పిల్లలు వాగులు, వంకలు, కేసీ కెనాల్, బావులకు ఈతకు వెళ్లకుండా చూడండి మరియు సెల్ ఫోన్ లకు దూరంగా పెట్టండి**

**నేరాల నియంత్రణపై, రోడ్డు భద్రత నియమాలపై ప్రజలకు అవగాహన కల్పించిన ఆత్మకూరు డిఎస్పి- ఆర్.రామాంజి నాయక్**



**పాములపాడు మే 5 రిపబ్లిక్ న్యూస్:-** జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు ఆత్మకూరు డిఎస్పి-ఆర్. రామంజి నాయక్, ఆత్మకూరు రూరల్ సి.ఐ- ఎం.సురేష్ కుమార్ రెడ్డి, మరియు పాములపాడు ఎస్సై- కె.సురేష్ బాబు ల ఆధ్వర్యంలో పాములపాడు మండలంలోని, ఇస్కాల గ్రామంలో గ్రామసభ నిర్వహించడమైనది. ఈ సందర్భంగా ఆత్మకూరు డిఎస్పి- ఆర్.రామాంజి నాయక్, రూలర్ సిఐ-ఎం.సురేష్ కుమార్ రెడ్డి, ఎస్సై- కె.సురేష్ బాబు లు గ్రామ సభలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ రోడ్డు భద్రతపై పంచసూత్రాలు అయిన హెల్మెట్ తప్పని సరిగా ధరించాలని, సీట్ బెల్ట్ తప్పని సరిగా ధరించాలని, మద్యం త్రాగి వాహనము నడపరాదని, సెల్ ఫోన్ డ్రైవింగ్ చేయరాదని, ఓవర్ లోడ్ ఆటోలలో ప్రయాణం చేయరాదని, తెలియజేయడం జరిగింది. మీరు నడుపు వాహనములకు ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని, నడిపే వ్యక్తికి ఖచ్చితంగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ఆన్లైన్ గేమ్స్, ఆన్లైన్ లోన్స్, ఆప్స్, ఓటిపి ల గురించి, ఆన్లైన్ ట్రాన్సక్షన్స్, ఆన్లైన్ లో ఎవరైనా ఉద్యోగం ఇప్పిస్తామని చెబితే నమ్మవద్దని, అలాగే తెలిసినవారు ఎవరైనా ఉద్యోగం ఇప్పిస్తామంటే నమ్మవద్దని, స్వయంకృషిని నమ్ముకోవాలని తెలియజేయడం జరిగింది. మహిళలపై జరిగే నేరాలు గురించి, బాల్య వివాహాలు గురించి అవగాహన కల్పించడం జరిగింది. దొంగతనాలు, చైన్ స్నాచింగ్లు జరుగుతున్నాయి కాబట్టి విలువైన ఆభరణములు, వస్తువుల పట్ల జాగ్రత్తగా ఉండవలెనని, ఒంటరిగా వెళ్లకూడదని హెచ్చరిక చేశారు. రైతులు పంట పొలాలకు మందులు కొట్టేటప్పుడు తప్పనిసరిగా నోటికి గుడ్డ కట్టుకోవాలని లేదా మాస్క్ వేసుకోవాలని తెలియజేయడం జరిగింది. లేనట్లయితే ఆ మందు పిచికారి చేసేటప్పుడు గాలిపీల్చి అస్వస్థకు గురవుతారన్నారు. ఇటీవల కాలంలో కొన్ని కుటుంబ కలహాలతో, అప్పులు అని ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, ప్రతి సమస్యకు ఒక పరిష్కారం తప్పక ఉంటుందని కనుక ఎట్టి పరిస్థితుల్లో ఆత్మహత్యలు చేసుకోకూడదని అన్నారు. మీరు చేసుకున్న అప్పులకు, గొడవలకు పూర్తి కుటుంబాన్ని ఆత్మహత్యలకు ఉసిగొల్పకూడదని, బలవంతంగా ఆత్మహత్యలు చేసుకోవడానికి ప్రేరేపించడం మహాపాపం అన్నారు. మీకు ఏదైనా సమస్యలు ఉన్నట్లయితే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసి, సమస్యను పరిష్కరించుకోవాలని తెలియజేయడం జరిగింది.

ఇటీవల కాలంలో పిల్లలు సెల్ ఫోన్ వినియోగం ఎక్కువైందని, తల్లిదండ్రులు పిల్లలు పట్ల జాగ్రత్తగా ఉండాలని, సెల్ ఫోన్లు ఇవ్వకుండా చూడాలన్నారు.

ఎండాకాలం సెలవులు కావున పిల్లలు ఈతకు ఏసి కెనాల్, తెలుగు గంగ, వాగులు, వంకలు మరియు బావుల వద్దకు వెళుతున్నారని, ఇది ప్రమాదకరమన్నారు. కనుక పిల్లలు ఎక్కడకు వెళుతున్నారనేది పెద్దలు(తల్లిదండ్రులు) గమనించాలన్నారు. మీరు ఎక్కడికి వెళ్లాలన్న మాకు చెప్పి వెళ్లాలని తల్లిదండ్రులకు పిల్లలకు చెప్పాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది.

# ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలను సీజ్ చేయాలి

**:ఏఐఎస్ఎఫ్ కర్నూల్ జిల్లా ఉపాధ్యక్షుడు యస్.ఈరేష్**



**మంత్రాలయం మే5(రిపబ్లిక్ న్యూస్):-** కోసిగి మండల అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో ముందస్తు అక్రమ అడ్మిషన్లు, ఫీజుల, పేరుతో దోపిడి, పుస్తకాలాతో, వ్యాపారాన్ని, అరికట్టాలని కోరుతూ సోమవారం సిపిఐ పార్టీ కార్యాలయం నందు విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు యస్. ఈరేష్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే కార్పొరేట్ విద్యాసంస్థలు ముందస్తు అడ్మిషన్లు చేస్తూ ఇప్పుడు చేసుకుంటే ఒక ఫీజు జూన్లో చేసుకుంటే మరొక ఫీజు అని తల్లితండ్రులకు మాయమాటలు చెప్పి లక్షల రూపాయలు దండుకుంటున్నారని మండిపడ్డారు, ప్రభుత్వా నిబంధనలకు విరుద్ధంగా విద్యా సంస్థల పేరుతో ముద్రించిన పుస్తకాలు అమ్మకూడదని నిబంధన ఉన్నప్పటికీ నిబంధన తుంగలో తొక్కుతూ పుస్తకాలు 9000 నుంచి 15వేల రూపాయల వరకు ఒక తరగతికి విక్రయిస్తున్నారని మండిపడ్డారు, పుస్తకాల వ్యాపారంతో పాటు స్టేషనరీ వ్యాపారం కూడా చేస్తున్నారని పేర్కొన్నారు,, జిల్లాలో చాలా విద్యాసంస్థలు అద్దె అపార్ట్మెంట్లలో నిర్వహిస్తూ అనుమతులు లేకుండా కనీసం విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణం లేకుండా క్రీడా మైదానం లేకుండా సరైన వసతులు లేకుండా విద్యాసంస్థలు నిర్వహిస్తూన్నారు, కేవలం వారికి ఫీజులు వసూలు చేయడమే ధ్యేయంగా పని చేస్తున్నారని మండిపడ్డారు,, ఇప్పటికే ఆర్ ఐ ఓ వారికి అనేక సందర్భాల్లో వినతి పత్రాలు ధర్నాల రూపంలో తెలియజేసిన ఏ ఒక్క విద్యా సంస్థల పైన చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు,, డిఈఓ, డీవిఈవో లు స్పందించి కరువు జిల్లా విద్యార్థుల తల్లిదండ్రుల కష్టాలు తీర్చేందుకు అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న పాఠశాల, కళాశాల, విద్యాసంస్థల యాజమాన్యాల పైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ సహాయ కార్యదర్శి పురుషోత్తం, జాని, గోపాల్, దేవిపుత్ర, కర్ణాకర్, చార్లెస్, ఆశిష్, ప్రవీణ్, సమీర్, తదితరులు పాల్గొన్నారు

# కళ్ళు దగ్గర పేరుకొనే కొలెస్ట్రాల్

**కర్నూలు, ప్రతినిధి మీ మే 5(రిపబ్లిక్ న్యూస్)**

సాధారణంగా కొలెస్ట్రాల్ అనగానే మనకు లిపిడ్ ప్రొఫైల్ మరియు హార్ట్ ఎటాక్స్ గుర్తొస్తాయి.. కానీ కొందరికి వంశపారంపర్యంగా కొలెస్ట్రాల్ లెవెల్స్ ఎక్కువగా ఉంటాయి.. దీనిని ఫెమిలియల్ హైపర్ కొలెస్ట్రోలిమియా అంటారు వీళ్ళకు గుండె జబ్బులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. కొందరిలో కళ్ల చుట్టూ పసుపు పచ్చ రంగులో ఉండే చిన్న చిన్న పొక్కులు వస్తాయి..ఎగువ కనురెప్పలపై పసుపు రంగు ఫలకాలు జాంథెలాస్మా పాల్పెబ్రరం అంటారు, ఇవి నిరపాయకరమైన కొలెస్ట్రాల్ నిక్షేపాలు. అవి తరచుగా లిపిడ్ రుగ్మతలతో సంబంధం కలిగి ఉంటాయి, అయితే అవి



సాధారణ లిపిడ్ స్థాయిలు ఉన్నవారిలో కూడా, ముఖ్యంగా వృద్ధులలో సంభవించవచ్చు. వీరికి అధిక రక్తపోటు మరియు టైప్ 2 డయాబెటిస్ చరిత్ర ఉంటే, వీరికి అంతర్లీన డిస్లిపిడెమియా ఉండవచ్చు.

## మరేం చేయాలి?

సౌందర్య కారణాల వల్ల తప్ప జాంథెలాస్మాకు చికిత్స అవసరం లేదు. ఎంపికలలో శస్త్రచికిత్స ద్వారా తొలగించవచ్చు, లేజర్ అబ్లేషన్ (ఉదా., %జూ%2 లేజర్), లేదా రసాయన పీల్స్ (ఉదా., ట్రైక్లోరోఅసిటిక్ యాసిడ్) ఆప్షన్సు ఉన్నాయి. అయితే, పునరావృతం సాధారణం.

## జాగ్రత్త

మరీ ముఖ్యంగా, హైపర్లిపిడెమియా కోసం అంచనా వేయడానికి వీరి లిపిడ్ ప్రొఫైల్ను తనిఖీ చేయాలి, ఇది వారిలో హృదయ సంబంధ ప్రమాదాన్ని సూచిస్తుంది. మధుమేహం, రక్తపోటులను గుర్తించి వైద్యం పొందడం మరియు డైస్లిపిడెమియా లిపిడ్ ప్రొఫైల్లో నిర్ధారించబడితే స్టాటిన్ను ప్రారంభించడం మొత్తం ఆరోగ్యానికి కీలకం

**.డాక్టర్ చింతా ప్రభాకర్ రెడ్డి %MS MCh% గుండె మరియు ఊపిరితిత్తుల శస్త్రచికిత్స నిపుణులుప్రభుత్వ సర్వజన వైద్యశాల కర్నూలు**

# విచారణ జరిపి చట్టపరిధిలో న్యాయం చేస్తాం

**పోలీస్ "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమానికి 93 ఫిర్యాదులు**

**ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి పరిష్కరించాలని పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ**

**జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా**





**నంద్యాల క్రైం, మే 5, (రిపబ్లిక్ న్యూస్):** పట్టణంలోని బొమ్మలసత్రం వద్ద గల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా "ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంనకు వచ్చి ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులపై పూర్తిస్థాయి విచారణ జరిపి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. చట్ట పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని, ఫిర్యాదులను మళ్ళీ పునరావృతం కాకుండా చూడాలి. నిర్ణీత గడువు లోపల ఫిర్యాదులను పరిష్కరించాలని, ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని, చట్ట పరిధిలో సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# బనగానపల్లెలో నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇస్తాం

**రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి**

**నంద్యాల, మే 05, రిపబ్లిక్ న్యూస్ :-** బనగానపల్లె పట్టణంలో ఇల్లు లేని నిరుపేదలు ప్రతి ఒక్కరికి 2 సెంట్ల ఇళ్ల పట్టాలు ఇస్తామని గతంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటామని రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో నిరుపేదల ఇళ్ల పట్టాల అంశంపై జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జాయింట్ కలెక్టర్ సి విష్ణు చరణ్ తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో డోన్ ఆర్డీవో నరసింహులు నంద్యాల ఆర్డీవో విశ్వనాథ్, బనగానపల్లె మండల తాసిల్దారు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోడ్డు భవనాలు, మౌలిక సదుపాయాలు పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ బనగానపల్లి పట్టణంలో దాదాపు 3500 నుంచి 4 వేల మంది నిరుపేదలకు 2 సెంట్లు ఇళ్ల స్థలాలు ఇస్తామని గతంలో హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఇందుకు సంబంధించి పేదలకు పట్టాలు ఇచ్చేందుకు వీలుగా ఉన్న ప్రభుత్వ భూములను పరిశీలించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. రెవెన్యూ అధికారుల పరిశీలనలో భాగంగా బనగానపల్లె పట్టణం భానుముక్కల



గ్రామంలో పరిధిలో ప్రభుత్వ భూమిని గుర్తించాలని మంత్రి ఆదేశించారు అయితే 3500 నుంచి 4 వేల మందికి 2 సెంట్లు చొప్పున ప్రభుత్వ స్థలం ఇవ్వడానికి దాదాపు 116 నుంచి 140 ఎకరాల ప్రభుత్వ భూమి అవసరం అవుతోందని అధికారులు తెలిపారు.

అలాగే బనగానపల్లెలో ఆటోనగర్ ఏర్పాటుకు సాధ్యసాధ్యాలను పరిశీలించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. బనగానపల్లెలో కార్పెంటర్లకు శాశ్వత నివాసాలు ఏర్పాటుకు కార్పెంటర్ కాలనీ ఏర్పాటుపై కూడ సాధ్యసాధ్యాలను పరిశీలించాలని అధికారులను మంత్రి ఆదేశించారు.





# గదిలోకి తీసుకువెళ్ళలేక పోయారా ! మేడమ్






**నంద్యాల ప్రతినిధి, మే 5, (రిపబ్లిక్ న్యూస్):** నంద్యాల ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని కొందరి వైద్యాధికారులకు వారి వాహనాలపై ఉన్న మమకారం,అతి జాగ్రత్త హాస్పిటల్ కి వచ్చే రోగులకు ఇబ్బందులు కలిగించే విధంగా ఉన్నాయి. ఎందుకంటే వారు తీసుకువచ్చే వాహనాలను (స్కూటీ) ఏకంగా హాస్పిటల్లోని వారికి కేటాయించిన గదుల వద్దకు తీసుకువెళ్లి అక్కడే పార్కింగ్ చేస్తున్నారు. ఎవరేమనుకున్నా మాకేమీ? ఎవరు ఇబ్బంది పడితే మాకేంటి ? అనే విధంగా వారి ప్రవర్తన ఉంది. ఈ క్రమంలో వైద్యాధికారుల వాహనాల పార్కింగ్ చేసిన విధానం పై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎవరైనా రోగుల తరపు బంధువులు,వారి వెంట వచ్చిన సహాయకులు అటు పక్క తిరిగితే రోగులకు ఇన్ఫెక్షన్ వస్తుంది.. మీరు బయటకు వెళ్ళండి.. అని బయటకు వెళ్లే దాకా వదలకుండా రచ్చ రచ్చ చేసే వైద్య సిబ్బందికి మరి రోడ్ల పైన ఎక్కడపడితే అక్కడ తిరిగిన వాహనాలు రోగులకు అనుకుని ఉన్న గదుల వద్ద పార్కింగ్ చేస్తే రోగులకు ఇన్ఫెక్షన్ శోకదా.. అని ప్రశ్నిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ చిత్రంలో కనిపిస్తున్న హాస్పిటల్ లోపల ప్రొఫెసర్ గది అనుకొని పార్కింగ్ చేసిన స్కూటీని గమనించిన ప్రజలు గదిలోపలికి తీసుకు వెళ్లలేకపోయారా? మేడం అని సందేహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే మెయిన్ గేటు ఎదురుగా పలువురు వైద్య సిబ్బంది ప్రతిరోజు వాహనాలను అక్కడే పార్కింగ్ చేయడంతో ఎమర్జెన్సీ వైద్య చికిత్స నిమిత్తం వచ్చే అంబులెన్స్ లను ఎక్కడ ఉంచాలి? రోగులను ఎలా తీసుకువెళ్లాలని వారు ప్రశ్నిస్తున్నారు. అందరికీ ఆదర్శంగా ఉండాల్సిన మీరే ఈ విధంగా పార్కింగ్ చేస్తే మరి ప్రజలు ఏ విధంగా ఉండాలని ప్రజానికం నిలదీస్తున్నారు. ఇప్పటికైనా రోగులకు ఇబ్బందికరంగా మారిన వైద్యాధికారుల పార్కింగ్ విధానంపై ఉన్నతాధికారులు ఏ విధమైన చర్యలు తీసుకుంటారో వేచి చూడాలనీ ప్రజలు చర్చించుకుంటున్నారు.




# మద్దతు ధరకు కొనుగోలులో రాయలసీమ రైతాంగం పట్ల వివక్ష వీడండి

**రైతులను చులకనగా చూడొద్దు**

**నంద్యాల మేన 5( రిపబ్లిక్ న్యూస్) :**



రైతుల నుంచి జొన్నల కొనుగోలు పట్ల ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్య వైఖరితో ఉందని బొజ్జా దశరథ రామిరెడ్డి తీవ్రంగా స్పందించారు. సోమవారం నంద్యాల సమితి కార్యాలయంలో దశరథరామిరెడ్డి మాట్లాడుతూ..

జొన్న దిగుబడులు బాగా తగ్గి నష్టాలలో ఉన్న రైతాంగానికి మద్దతు ధర కూడా లభించని సంధర్భంలో ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేయాలని రైతు సంఘాలు, రైతులు ప్రభుత్వానికి, ప్రజా ప్రతినిధులకు పలుమార్లు విజ్ఞప్తి చేసిన విషయాన్ని బొజ్జా గర్తుచేసారు. కాని పంట వచ్చిన రెండు నెలల తరువాత కొనుగోలు నిర్ణయాన్ని ప్రకటించిన ప్రభుత్వం, కొనుగోలు కేంద్రాలను తెరవడానికి నెల రోజులు తీసుకోవడం రాయలసీమ రైతాంగం పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి తార్కాణం అని బొజ్జా పేర్కొన్నారు. పంట వచ్చిన మూడు నెలల తరువాత రైతుల నుంచి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిన ప్రభుత్వం అందుకు తగ్గట్లుగా జొన్నలను సేకరించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేసారు. గోదాములకు తీసుకొచ్చిన ధాన్యాన్ని దిగుమతి చేయకుండా రోజుల తరబడి నిలిపివేస్తున్నారని ఆవేధన వ్యక్తం చేసారు. ఈ చర్యలతో రైతులు గోదాముల దగ్గరే నిద్రాహారాలుమాని కాపలా వుండవలసి రావడంతో శారీరక అలసటతో పాటు, వాహనాల కిరాయి పెరగడం వలన రైతులకు అదనపు ఆర్థిక భారం పడటం బాధాకరమని బొజ్జా పేర్కన్నారు. రాష్ట్రంలోని మిగతా ప్రాంతాలలో ధాన్యాన్ని విజయవంతంగా సేకరిస్తున్న ప్రభుత్వం రాయలసీమలో జొన్నల సేకరణ పట్ల పూర్తి ఉదాసీనంగా వ్యవహరించాడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. కొనుగోలు పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ది లేకపోవడం వలన రోజుల తరబడి రైతులు గోదాముల దగ్గర సరియైన వసతులు లేక దయనీయమైన స్థితిలో పడిగాపులు కాస్తున్నారు. ధాన్యాన్ని తీసుకొచ్చిన రైతుల పట్ల చులకనగా వ్యవహరిస్తున్నారనీ.. ఇది మంచి పద్ధతి కాదని ఆరుగాలం కష్టపడి పండించిన రైతులకు ఇచ్చే విలువ ఇదేనా అని బొజ్జా ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దీనిపై తక్షణమే ప్రభుత్వం స్పందంచి జొన్నల కొనుగోలు వేగవంతం చేసి రైతులను ఆదుకోవాలని బొజ్జా ప్రభుత్వానికీ విజ్ఞప్తి చేసారు.

# జాతీయ స్థాయి టార్గెట్ బాల్ పోటీలలో విశేష ప్రతిభ కనబరిచిన షేక్ సుహాన కు మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అభినందనలు..

**బనగానపల్లె నెహ్రూ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్లో 8 వ తరగతి చదువుతున్న షేక్ సుహాన**

**షేక్ సుహాన జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతలు సాధించడం మనందరికీ గర్వకారణం అన్న మంత్రి**

**క్రీడల అభివృద్ధికి తన సంపూర్ణ సహకారం ఉంటుందన్న మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి**

**బనగానపల్లె, మే 5, రిపబ్లిక్ న్యూస్ :** జాతీయ స్థాయి టార్గెట్ బాల్ పోటీలలో విశేష ప్రతిభ కనబరిచిన నెహ్రూ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థిని షేక్ సుహానను రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ



జనార్ధన్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. జాతీయస్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టును మొదటి స్థానంలో నిలిపిన షేక్ సుహానాను ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సోమవారం తన ఛాంబర్ లో ప్రత్యేకంగా అభినందించారు. గత నెల 25 నుండి 29వ వరకు ఉత్తరప్రదేశ్ లోని ఆగ్రాలో జరిగిన జాతీయస్థాయి టార్గెట్ బాల్ పోటీలలో విద్యార్థిని షేక్ సుహానా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించడం... ఈ జాతీయ స్థాయి పోటీలలో ఆంధ్రప్రదేశ్ జట్టు తొలి స్థానంలో నిలిచి విజేతగా నిలవడం మనందరికీ గర్వకారణమని మంత్రి తెలిపారు.. బనగానపల్లె విద్యార్థిని రాష్ట్ర జట్టులో స్థానం సంపాదించి.. రాష్ట్ర జట్టు తరపున ఆడి జాతీయ స్థాయిలో బనగానపల్లె నియోజకవర్గానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావడం అభినందించదగ్గ విషయమని అన్నారు. ఇందుకు ప్రోత్సహించిన ఆమె తల్లిదండ్రులు, నెహ్రూ హైస్కూల్ యాజమాన్యానికి, వ్యాయామ ఉపాధ్యాయులకు మంత్రి అభినందనలు తెలిపారు. క్రీడల అభివృద్ధికి తన సంపూర్ణ సహకారం ఉంటుందని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. తమ పాఠశాల విద్యార్థిని జాతీయస్థాయి టార్గెట్ బాల్ పోటీలలో ప్రతిభ చూపడం సంతోషంగా ఉందని, ఈ సందర్భంగా కరస్పాండెంట్ కోడూరు హరినాథ్ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ కోడూరు కమల్ తేజా రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ కోడూరు రవితేజా రెడ్డి, వ్యాయామోపాధ్యాయులు విద్యార్థిని షేక్ సుహానాను అభినందించారు.

# తెలంగాణ రాష్ట్రంలో స్వల్ప భూకంపం

**పాత కరీంనగర్ జిల్లాలో భూకంపం..!**

**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి ధర్మారం ,మే 5 (రిపబ్లిక్ న్యూస్)**

రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భూమి కంపించింది కరీంనగర్,జగిత్యాల,ఫెద్దపల్లి,సిరిసిల్ల,నిర్మల్ , జిల్లా లతొ పాటు పలు ప్రాంతాల్లో ధర్మారం, మెట్ పల్లి , కోరుట్ల ప్రాంతాల్లో భూమి కంపనాలు సాయంత్రం 6 గంటలకు 47 నిమిషాలకు భూమి కంపించింది సుమారు 3 సెకండ్ల పాటు భూమి కంపించడంతో ఏం జరుగుతుందో అర్థం కాక ప్రజలు భయందోళానకు గురయ్యారు భూమి కంపించడంతో ఇంట్లోని వస్తువులు చిన్నపాటి కుదుపులకు గురయ్యాయి భూమి ఊగినట్లు దీని తీవ్రత రిక్టర్ స్కేల్ పై 3.8 నమోదయినట్లు సమాచారం

# రెవెన్యూ ఫిర్యాదులను వేగవంతంగా పరిష్కరించండి

**రీఓపెన్ దరఖాస్తులను తక్షణమే పరిష్కరించండి**

**పిజిఆర్ఎస్ కు 207 దరఖాస్తులు**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

**నంద్యాల ప్రతినిధి, మే 05, రిపబ్లిక్ న్యూస్ :-** ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి స్వీకరించిన దరఖాస్తులలో రెవెన్యూ శాఖకు సంబంధించినవి అత్యధికంగా ఉన్నాయని వితిన్ ఎస్ఎల్ఎ లోగా పరిష్కరించేందుకు ఆర్డీవోలు, తహశీల్దార్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా నలుమూలాల నుంచి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డిఆర్వో రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ ప్రజల నుండి స్వీకరించిన వినతులలో రెవెన్యూ శాఖకు సంబంధించిన ఫిర్యాదుల అత్యధికంగా ఉన్నాయని వీటన్నిటిని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు



తీసుకోవాలని ఆర్డీవోలు, తహశీల్దార్లను ఆదేశించారు. అర్జీదారుల ఫిర్యాదులను సరిగ్గా రెడ్రస్ చేయని కారణంగా 77 దరఖాస్తులు రీఓపెన్ అయ్యాయని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందులో 25 రెవెన్యూ, 11 సర్వేకు శాఖకు సంబంధించినవి ఉన్నాయని ప్రతిరోజు టెలికాన్ఫరెన్స్ తీసుకొని క్లియర్ చేసేలా చర్యలు తీసుకోవాలని డిఆర్ఓ ను కలెక్టర్ ఆదేశించారు. పిజిఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారంపై అర్జీదారుల అభిప్రాయ సేకరణకు సంబంధించి నాలుగు సచివాలయాలు ఇంతవరకు అభిప్రాయ సేకరణ ప్రారంభించకపోవడానికి గల కారణాలు




ఏంటని కలెక్టర్ డిఎల్డిఓ, డిప్యూటీ సీఈఓ ను ప్రశ్నిస్తూ అభిప్రాయ సేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు.

గ్రామ, వార్డు సచివాలయ సర్వేలలో భాగంగా పెండింగ్ లో ఉన్న 102 మిస్సింగ్ ఎంప్లాయిస్ డేటా, సిటిజన్ ఈ-కేవైసీ 1.20 లక్షలు, 996 మంది వర్క్ ఫ్రం హోం డేటా, చిల్డ్రన్ వితౌట్ ఆధార్ 5554, మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ 72 వేలు పెండింగ్ లో ఉన్నాయని వీటన్నిటిని త్వరితగతిన సర్వే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

ప్రజా రిపబ్లిక్ దిన పత్రిక
ప్రతి అక్షరం ప్రజల కోసం
9948814188,
9985876888
ప్రకటన
ప్రజా సమస్యల పై అనునిత్యం ప్రజా గళాన్ని అక్షర సత్యాలతో కూడిన
సంచలన వరుస కథనాలను అందిస్తూ దూసుకెళ్తున్న
ప్రజా రిపబ్లిక్ దినపత్రికకు రెండు తెలుగు రాష్ట్రాలలో
తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ జిల్లాలలో, నియోజకవర్గాలలో
స్టాఫ్ రిపోర్టర్లు, పాత్రికేయులు, మండలాల నందు పాత్రికేయులు కావలెను.
ప్రజల పక్షాన నిలుస్తూ సమస్యల పరిష్కారానికి అక్షర పోరాటం
చేయడానికి మాతో కలిసి పని చేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులు
కర్నూలు మరియు నంద్యాలలోని మా కార్యాలయముల
నందు లేదా ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.
ప్రజా రిపబ్లిక్ దినపత్రిక కార్యాలయం, షాప్ నెం: 26, మొదటి అంతస్తు,
శ్రీనివాస కాంప్లెక్స్, శ్రీనిధి టిఫిన్ సెంటర్ ఎదురుగా, నంద్యాల - 518501
డోర్ నెం:46/181/బి-1, మనోజ్ టాలెంట్ స్కూల్ దగ్గర, బుధవార పేట, కర్నూలు - 518001
బొజ్జ నాగేంద్ర
ఎడిటర్ & మేనేజింగ్ డైరెక్టర్

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com